# క్రైమ్ THE మిర్రర్®

Voice of Anti Corruption

హైదరాబాద్
17-9-2026
వెల: రూ.5/-
పేజీలు: 10+10
సంపుటి:16
సంచిక:177

PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD


తెలంగాణ అసెంబ్లీ సమావేశాల కొనసాగింపు నిర్ణయం వెనుక భారీ వ్యూహం ఉన్నట్లు తెలుస్తోంది. శాసనమండలి సమావేశాలు నిరవధికంగా వాయిదా పడినప్పటికీ.. శాసనసభను మాత్రం పొడిగించి.. రిజిస్ట్రేషన్ చట్టంలోని సెక్షన్ 22ఏ అంశంపై స్వల్పకాలిక చర్చను కొనసాగించాలని కాంగ్రెస్ ప్రభుత్వం నిర్ణయించింది.

# రేవంత్ భారీ స్కెచ్!

## అసెంబ్లీ పొడిగింపు వెనుక వ్యూహం

## ధరణి పాపాల చిట్టాను బయట పెట్టేందుకే..


## డిఫెన్స్ లోకి గులాబీ పార్టీ

**క్రైమ్ మిర్రర్, తెలంగాణ బ్యూరో**

దీని వెనుక పక్కా రాజకీయ, వ్యూహాత్మక లెక్కలు ఉన్నట్లు తెలుస్తోంది. సాధారణంగా ఒక సెషన్ ముగింపు దశకు చేరుకున్నప్పుడు.. ఉభయసభలు ఒకేసారి నిరవధికంగా వాయిదా పడడం ఆనవాయితీ.

- మిగతా 3వ పేజీలో






## కాంగ్రెస్ లో ఎమ్మెల్సీ పదవులకు విపరీతమైన పోటీ

## బలమైన అభ్యర్థులను బరిలోకి దించేందుకు రేవంత్ ప్రణాళిక

తెలంగాణలో ఎమ్మెల్సీ ఎన్నికల సందడి మొదలైంది. గవర్నర్ కోటాలో 3, గ్రాడ్యుయేట్ కోటాలో 2 ఎమ్మెల్సీ స్థానాలు ఖాళీ అవుతున్నాయి. దీంతో ఆశావహులు ఎవరి ప్రయత్నాల్లో వారు నిమగ్నమయ్యారు. సీఎం రేవంత్ దృష్టిలో పడేందుకు తంటాలు పడుతున్నారు. అధికార కాంగ్రెస్లో విపరీతమైన పోటీ కనిపిస్తోంది.

**క్రైమ్ మిర్రర్, తెలంగాణ బ్యూరో**

ఐదు పదవులకు గాను 50 మందికి పైగా పోటీ పడుతుండడం విశేషం. ఎవరి ప్రయత్నాల్లో వారు ఉన్నారు. హై కమాండ్ ద్వారా కొందరు.. కీలక నేతల ద్వారా మరికొందరు ఎమ్మెల్సీ పదవులు దక్కించుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు.

**నవంబర్లో పదవులు ఖాళీ..**

గవర్నర్ కోటాకు సంబంధించి మూడు ఎమ్మెల్సీ పదవులు నవంబర్లో ఖాళీ అవుతున్నాయి. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీల పదవీకాలం మార్చిలో ముగియనుంది. దీంతో ఒకేసారి 5 ఎమ్మెల్సీల అభ్యర్థులను ప్రకటించాలా? ముందుగా గ్రాడ్యుయేట్ అభ్యర్థులను ప్రకటించి.. తరువాత గవర్నర్ కోటా

- మిగతా 2వ పేజీలో



# గులాబీ మైండ్ గేమ్ రాజకీయం!

## కేటీఆర్ పిఏ, పిఆర్వో విచారణలో హై డ్రామా

## పక్కా ప్రణాళిక వ్యూహంతో బిఆర్ఎస్

## రాజకీయ బాధిత ప్రచార ఆయుధంగా మార్చుకున్న వైనం

**క్రైమ్ మిర్రర్, తెలంగాణ బ్యూరో:** తెలంగాణలో రాజకీయాలు ఆసక్తికరంగా మారుతున్నాయి. ముఖ్యంగా ప్రతి అంశాన్ని రాజకీయం చేసే పనిలో పడింది గులాబీ పార్టీ. అధికార

- మిగతా 2వ పేజీలో

# ఇదేంటి 'సర్'!

## పోలైన ఓట్లు కంటే తొలగింపు ఓట్లు అధికం

## యాకత్ పురా నియోజకవర్గంలో విచిత్రం



**క్రైమ్ మిర్రర్, తెలంగాణ బ్యూరో:** తెలంగాణలో సర్ ప్రక్రియ ప్రకంపనలు రేపుతోంది. పాతబస్తీలోని కీలకమైన యాకత్ పురా శాసనసభ నియోజకవర్గ పరిధిలో సర్ సంచలనంగా మారింది. ఈ నియోజకవర్గంలో ఏకంగా 1,54,982 ఓట్లను

2లో



# మాక్ అసెంబ్లీతో సెల్ఫ్ గోల్!

## సీఎం చైర్ లో తలసాని

### ముఖ్యమంత్రి అభ్యర్థిగా ప్రకటించాలని డిమాండ్

### కనీసం ప్రతిపక్ష నేతగా ప్రకటించాలని సూచన

### కాంగ్రెస్ రివర్స్ పంచ్ తో ఇరకాటంలో గులాబీ పార్టీ

**క్రైమ్ మిర్రర్, తెలంగాణ బ్యూరో:** బిఆర్ఎస్ మాక్ అసెంబ్లీ ఆ పార్టీకి రివర్స్ అవుతోందా? అనే అనుమానం కలుగుతోంది. అసెంబ్లీ నుంచి ఎమ్మెల్యేలపై సస్పెన్షన్ వేటును నిరసిస్తూ గులాబీ పార్టీ.. మాక్ అసెంబ్లీ నిర్వహించింది. ప్రత్యేక సెట్ట వేసింది కూడా దానికోసం. ఈ మాక్ అసెంబ్లీలో తలసాని శ్రీనివాస్ యాదవ్ ను సీఎం స్థానంలో కూర్చోబెట్టారు.

- మిగతా 2వ పేజీలో



# వైసీపీకి తమ్మినేని గుడ్ బై!

## హై కమాండ్ తీరుపై తీవ్ర ఆగ్రహం

## ధర్మాన సోదరుల వైఖరిని నిరసిస్తూ పార్టీ నుంచి

**క్రైమ్ మిర్రర్, ఏపీ బ్యూరో:** ఉత్తరాంధ్రలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి వరుసగా షాక్ లు తగులుతున్నాయి. మొన్ననే విజయనగరం జిల్లాకు చెందిన జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు పార్టీకి గుడ్ బై చెప్పారు. ఇప్పుడు అదే బాటలో మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం ఉన్నట్లు ప్రచారం నడుస్తోంది. గత కొంతకాలంగా నాయకత్వంపై ఆగ్రహంగా ఉన్నారు తమ్మినేని. ఆమదాలవలస వైసిపి బాధ్యతలు నుంచి తనను తప్పించి

- మిగతా 2వ పేజీలో

# రాజకీయాల్లోకి హైడ్రా రంగనాథ్!

## జనసేనలో చేరే అవకాశం ..ఎంపీగా ఏపీ నుంచి పోటీ

**క్రైమ్ మిర్రర్, తెలంగాణ బ్యూరో:** హైడ్రా రంగనాథ్ రాజకీయాల్లోకి వెళ్తారా? వెళితే ఏ పార్టీలో చేరుతారు? తెలంగాణ రాజకీయాల్లోకి వెళ్తారా? లేకుంటే ఏపీ పాలిటిక్స్ లో ప్రవేశిస్తారా? పొలిటికల్ వర్గాల్లో దీనిపైనే చర్చ నడుస్తోంది. తెలంగాణలో హైడ్రా కమిషనర్ గా రంగనాథ్ కు గొప్ప గుర్తింపు ఉంది. ముక్కు సూటిగా పనిచేస్తారు అని మంచి పేరు ఉంది. గతంలో తెలంగాణ వ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో పోలీస్ అధికారిగా పనిచేశారు.

3లో

జనసేన పార్టీ
JANASENA PARTY



# వారణాసికి చంద్రబాబు!

## ప్రధాని మోదీ జన్మదిన వేడుకలకు హాజరు

## ఎన్డీఏ అగ్రనేతలతో కలిసి కార్యక్రమాలు..



2లో

# వైసీపీకి తమ్మినేని గుడ్ బై!



చింతాడ రవికుమార్ అనే ద్వితీయ శ్రేణి నాయకుడికి అప్పగించడాన్ని జీర్ణించుకోలేకపోయారు. తన కుమారుడికి బాధ్యతలు ఇప్పించాలని ఆయన బలంగా కోరుతున్నారు. అయితే హై కమాండ్ నుంచి ఆశించిన స్థాయిలో స్పందన రాకపోవడంతో తమ్మినేని పార్టీకి గుడ్ బై చెప్పేందుకు సిద్ధపడినట్లు ప్రచారం నడుస్తోంది.

**వైసిపి పై విమర్శలు..**

తాజాగా తమ్మినేని సీతారాం కుమారుడు చిరంజీవి నాగ్ అత్యవసరంగా విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకత్వంపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఒక్క సీటు కూడా గెలుచుకోలేదని అన్నారు. అనుమానం ఉంటే అంతర్గత సర్వే నివేదికలను సరిచూసుకోవచ్చు అంటూ చెప్పుకొచ్చారు. తద్వారా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి గుడ్ బై చెబుతున్నట్లు సంకేతాలు ఇచ్చారు. ఇటీవల కొంతమంది వైసీపీ నేతలు తమ్మినేని సీతారాం పై అనుచిత వ్యాఖ్యలు చేశారు. భూ వివాదానికి సంబంధించి తమ్మినేని కుటుంబం అరెస్టు కాకపోవడానికి టిడిపి తో కుమ్మక్కు రాజకీయాలే కారణమని ఆరోపించారు. అయితే దీనిని జిల్లా నాయకత్వం కనీసం ఖండించలేదు. ఈ పరిస్థితుల్లో వైసీపీలో ఉండడం కంటే బయటకు వెళ్లిపోవడమే మేలన్న నిర్ణయానికి తమ్మినేని ఫ్యామిలీ వచ్చినట్లు జిల్లా వర్గాల్లో ప్రచారం నడుస్తోంది.

**ధర్మాన ఫ్యామిలీ కుట్ర..**

తమపై తెరవెనుక ధర్మాన ఫ్యామిలీ కుట్ర చేస్తోంది అనేది తమ్మినేని కుటుంబంలో ఉన్న అనుమానం. జిల్లా రాజకీయాల్లో చక్రం తిప్పుతున్న ధర్మాన సోదరులు పార్టీలో తమ్మినేనిని లేకుండా చేయడమే లక్ష్యంగా పావులు కదుపుతున్నారు అనేది ఒక వాదన. ఆమదాలవలస నియోజకవర్గ ఇన్చార్జ్ చింతాడ రవికుమార్ అరెస్ట్ జరిగిన సంగతి తెలిసిందే. జగన్మోహన్ రెడ్డి పర్యటనలో ఓ మహిళ ఎస్సై పట్ల అనుచిత ప్రవర్తన పై కేసు నమోదు కావడంతో ఆయన అరెస్టు జరిగింది. అదే సమయంలో తమ్మినేని ఫ్యామిలీ పై ఓ భూ కబ్జా కేసు నమోదు అయింది. చింతాడ రవికుమార్ అరెస్టు జరిగి.. తమ్మినేని ఫ్యామిలీ అరెస్టు జరగకుండా చేయడం వెనుక కుమ్మక్కు రాజకీయాలు ఉన్నాయి అంటూ మొన్న మధ్యన వైసీపీకి చెందిన ఓ మాజీ ఎమ్మెల్యే ఆరోపించారు. అయితే దీని వెనుక ధర్మాన సోదరుల హస్తం ఉందనేది తమ్మినేని కుటుంబం అనుమానం.

**తమ్మినేనిని తప్పించి..**

ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ తమ్మినేని సీతారాంకు సమీప బంధువు. తమ్మినేని ఫ్యామిలీ పై కేసులు నమోదు కాకుండా కూన రవికుమార్ అడ్డుపడుతున్నారన్నది వైసీపీ ఆరోపణ. గతంలో తెలుగుదేశం లోనే కొనసాగే వారు తమ్మినేని సీతారాం. 1983 నుంచి 1999 వరకు ఆమదాలవలస నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహించేవారు. టిడిపి అధికారంలోకి వచ్చిన ప్రతిసారి ఆయన మంత్రి అయ్యేవారు. 2009లో ప్రజారాజ్యం పార్టీలోకి వెళ్లారు తమ్మినేని. కానీ పార్టీలోనే ఉండిపోయారు ఆయన మేనల్లుడు కూన రవికుమార్. ఆ ఎన్నికల్లో టిడిపి అభ్యర్థిగా పోటీ చేసి ఓడిపోయారు. 2014లో టిడిపి అభ్యర్థిగా గెలిచారు రవికుమార్. 2019లో వైసీపీ అభ్యర్థిగా గెలిచారు తమ్మినేని సీతారాం. 2024లో తిరిగి రవికుమార్ ఎమ్మెల్యే అయ్యారు. అయితే కుటుంబంలో సర్దుబాటు ఉందన్న అనుమానాల నేపథ్యంలో తమ్మినేని సీతారాంను వైసీపీ బాధ్యతలు నుంచి తప్పించి చింతాడ రవికుమార్ కు అప్పగించారు. అప్పటినుంచి తమ్మినేని ఆగ్రహంగా ఉన్నారు. తాజా పరిణామాలతో పార్టీకి గుడ్ బై చెప్పేందుకు నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది.

# వారణాసికి చంద్రబాబు!


**క్రైమ్ మిర్రర్, ఏపీ బ్యూరో:** ఏపీ సీఎం చంద్రబాబు వారణాసి పర్యటనకు వెళ్తున్నారు. భారత ప్రధాని నరేంద్ర మోడీ జన్మదినం సందర్భంగా జరిగే వేడుకలకు హాజరవుతున్నారు. గుజరాత్ సీఎంగా, దేశ ప్రధానిగా పాతికేళ్ల పాలనా ప్రస్థానాన్ని పూర్తి చేసుకున్న సందర్భంగా వారణాసిలో వేడుకలు నిర్వహిస్తున్నారు. సెప్టెంబర్ 17న ప్రధాని నరేంద్ర మోడీ ప్రాతినిధ్యం వహిస్తున్న కాశీ కేంద్రంగా ఎన్డీఏ భాగస్వామ్య పక్షాలు, బిజెపి జాతీయ నాయకత్వం కలిసి సేవా సంకల్ప అభియాన్, భారీ బైక్ ర్యాలీని ప్రారంభించనున్నాయి. అందులో భాగంగా రుద్రాక్ష్ కన్వెన్షన్ సెంటర్లో జరిగే ప్రత్యేక సదస్సులో చంద్రబాబు పాల్గొనున్నారు.

**ప్రత్యేక ఏర్పాట్లు..**

ప్రధాని నరేంద్ర మోడీ జన్మదిన వేడుకలను ప్రత్యేకంగా చేయాలని నిర్ణయించారు. ఇప్పటికే ఏర్పాట్లను ప్రారంభించారు. వారణాసి పర్యటనలో భాగంగా రక్షణ శాఖ మంత్రి రాజ్నాథ్ సింగ్, యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్, కేంద్రమంత్రి చిరాగ్ పాస్వన్ తదితర ఎన్డీఏ అగ్రనేతలతో కలిసి చంద్రబాబు వేదిక పంచుకోనున్నారు. కాశీలోని లలితా ఘాట్ వద్ద 51 మంది సేవా కార్యకర్తల గంగాజలం సేకరించి, కాశీ విశ్వనాధునికి జలాభిషేకం చేసి, 11 కుండాల మహా యజ్ఞంలో పాల్గొనున్నారు చంద్రబాబు. అటు తర్వాత కాశీ నుంచి మోడీ జన్మస్థలమైన గుజరాత్ లోని వడ్ నగర్ వరకు సాగే భారీ సేవ సంకల్ప బైక్ యాత్రను ప్రారంభించనున్నారు.

**బలమైన బంధం..**

ఎన్డీఏ లో కీలక భాగస్వామిగా ఉన్నారు చంద్రబాబు. ప్రధాని నరేంద్ర మోడీతో ఉన్న బలమైన మైత్రి బంధాన్ని ఈ వేదిక ద్వారా మరోసారి చాటుకోనున్నారు. మోడీ పబ్లిక్ సర్వీస్, వెజినరీ నాయకత్వాన్ని అభినందిస్తూ.. మోడీ నాయకత్వంలో ఏపీ వికాసానికి, అమరావతి అభివృద్ధికి కేంద్రం ఇస్తున్న మద్దతు ఈ సందర్భంగా స్మరించుకునే అవకాశం ఉంది. కాశీ పర్యటన నిమిత్తం చంద్రబాబు ప్రత్యేక విమానంలో ఈరోజు బయలుదేరనున్నారు. కాగా ప్రధాని నరేంద్ర మోడీ జన్మదిన వేడుకలు, సేవా కార్యక్రమాలు అక్టోబర్ 2 గాంధీ జయంతి వరకు కొనసాగనున్నాయి. సేవ పక్వాడా పేరుతో రక్తదాన శిబిరాలు, ఉచిత వైద్య పరీక్షలు, పరిసరాల పరిశుభ్రత డ్రైవ్ ల రూపంలో దేశవ్యాప్తంగా నిర్వహించనున్నారు.




(మొదటి పేజీ తరువాయి)

ఎమ్మెల్సీ అభ్యర్థులను ప్రకటించాలా? అన్న విషయాన్ని కాంగ్రెస్ అధిష్టానం గట్టిగానే ఆలోచన చేస్తోంది. సామాజిక సమీకరణలను దృష్టిలో పెట్టుకుని ఎంపిక చేయాలని చూస్తోంది. అందులో భాగంగా రెండు ఎమ్మెల్సీ పదవులను బీసీలకు, మరో రెండు ఓసీలకు, ఒక పదవి ఎస్సీలకు కానీ ఎస్టీలకు కానీ అవకాశం స్పష్టంగా కనిపిస్తోంది.

**సరైన అభ్యర్థులు రంగంలోకి..**

గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానాల్లో సరైన అభ్యర్థులను రంగంలోకి దించాలని కాంగ్రెస్ హై కమాండ్ భావిస్తోంది. సామాజిక సమీకరణల కోణంలో కాకుండా.. గెలిచే అభ్యర్థులను ప్రోత్సహించాలని ఏఐసీసీ నేతలు భావిస్తున్నారు. బిఆర్ఎస్ హయాంలో గవర్నర్ కోటాలో నామినేట్ అయ్యారు బసవరాజు సారయ్య, దయానంద్ కాంగ్రెస్ లో చేరారు. వీరిద్దరూ మరోసారి తమ పదవులను రెన్యువల్ చేయాలని కోరుతున్నారు. సీఎం రేవంత్ ను కలిసి విజ్ఞప్తి చేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు.

**ఆరు జిల్లాల పరిధిలో..**

గ్రాడ్యుయేట్ ఎన్నికలు ప్రతిష్టాత్మకంగా జరగనున్నాయి. ఆరు జిల్లాల పరిధిలో ఎన్నికలు జరగడంతో కాంగ్రెస్ పార్టీ ప్రతిష్టాత్మకంగా తీసుకుంటోంది. వరంగల్ -ఖమ్మం- నల్గొండ... మహబూబ్నగర్- రంగారెడ్డి- హైదరాబాద్ గ్రాడ్యుయేట్ స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. తర్వాత నగరపాలక సంస్థ ఎన్నికలు రానుండడం.. అదే సమయంలో పరిషత్ ఎన్నికలపై ప్రభావం చూపనుండడంతో కాంగ్రెస్ జాగ్రత్తపడుతోంది. ఎట్టి పరిస్థితుల్లో కాంగ్రెస్ బలపరిచిన అభ్యర్థులను ఓడించి గట్టి దెబ్బ తీయాలని గులాబీ పార్టీ వ్యూహరచన చేస్తోంది. అందుకే గెలిచే అభ్యర్థులను రంగంలోకి దించాలని రేవంత్ భావిస్తున్నారు. అయితే ఐదు పదవులకు.. అధికార కాంగ్రెస్లో 50 మందికి పైగా నేతలు ఆశావహులుగా ఉండడం విశేషం.

# ఇదేంటి 'సర్'!



తొలగించేందుకు సిద్ధమవుతున్నారు. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో ఈ నియోజకవర్గంలో పోలైన మొత్తం ఓట్లు 1,40, 434 ఓట్లు కాగా.. తీసివేతకు సిద్ధం చేసిన ఓట్ల సంఖ్య దాదాపు 14,500 కంటే ఎక్కువ. ఈ అంశం ఇప్పుడు స్థానిక, రాజకీయ వర్గాల్లో కలకలం రేపుతోంది.

**హిందూ పేర్లే అధికం..**

పాత బస్తీలో కీలక నియోజకవర్గం ఇది. అయితే ఓట్ల తొలగింపు పేర్లలో సగం వరకు హిందూ పేర్లే ఉన్నాయి. ప్రధానంగా ఇతర ప్రాంతాలకు మారిపోయారనే నెపంతో 1,03,548 ఓట్లను, ఆబ్సెంట్ కింద 25,008 ఓట్లను, మరణించారని 14,566 ఓట్లను చేర్చారు. అంతేకాకుండా నకిలీ, డూప్లికేట్ ఓట్ల కేటగిరీలో నమోదైన 11860 ఓట్లు ఉన్నాయి. బూత్ లెవెల్ అధికారులకు సరైన డోర్ నెంబర్లు, పక్కా చిరునామాలు లేకుండా ఏ ఎస్ డి జాబితాలు ఇవ్వడం వల్ల క్షేత్రస్థాయి పరిశీలన అస్తవ్యస్తంగా మారింది.

**భిన్నాభిప్రాయాలు..**

అయితే ఈ సర్ ప్రక్రియను తప్పుపడుతున్నారు పాతబస్తీ నేతలు. కేవలం సగం చిరునామాలతో జనాభా సాంద్రత ఎక్కువగా ఉండే పాతబస్తీ వీధుల్లో.. ఓటర్లను ఏ విధంగా ధ్రువీకరిస్తారని ప్రశ్నిస్తున్నారు. ఓటర్ల జాబితాలోని ఇలాంటి లోపాల వల్లే పోలింగ్ శాతం చాలా తక్కువగా నమోదు అవుతుందని అభిప్రాయం కూడా ఉంది. ఇక్కడ 40 శాతానికి మించి ఓటింగ్ నమోదు కాదు. ఓటర్లు ఇక్కడే ఉంటే ఎందుకు ఓటు వేయరు అనే ప్రశ్న ఇప్పుడు ఉత్పన్నం అవుతోంది. పక్కాగా వెరిఫికేషన్ జరుగుతోందన్న అభిప్రాయం కూడా వినిపిస్తోంది. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో ఏకత్ పుర అసెంబ్లీ నియోజకవర్గం నుంచి ఎంఐఎం అభ్యర్థి గెలిచారు. ఎంబీటీకి చెందిన అభ్యర్థి స్వల్ప ఓట్ల తేడాతో ఓడిపోయారు. ఇప్పుడు లక్షన్నరకు పైగా ఓట్లను తొలగించడం లేదా మార్పులు చేయడం అనేది.. రాబోయే ఎన్నికల ఫలితాలను పూర్తిగా తలకిందులు చేసే అవకాశం ఉంది.

# 13 రోజులు దసరా సెలవులు

## అక్టోబర్ 1 నుంచి 9 వరకు సెలవులు

### విద్యాశాఖ కీలక షెడ్యూల్ విడుదల

హైదరాబాద్: తెలంగాణలో దసరా సెలవులపై విద్యాశాఖ బిగ్ అప్‌డేట్ ఇచ్చింది. ఒకటో తరగతి నుంచి 10వ తరగతి వరకు విద్యార్థులకు సమ్మేటివ్ అసెస్‌మెంట్-1 (ఎస్ఏ-1) పరీక్షల షెడ్యూల్‌తో పాటు దసరా సెలవుల తేదీలను కూడా తాజాగా ప్రకటించింది. అక్టోబర్ 1వ తేదీ నుంచి 9వ తేదీ వరకు ఎస్ఏ-1 పరీక్షలు నిర్వహించనుండగా.. ఆ తర్వాత అక్టోబర్ 10వ తేదీ నుంచి 22వ తేదీ వరకు పాఠశాలలకు దసరా సెలవులు ఉండనున్నాయి. అంటే ఈసారి దసరా పండగకు వరుసగా 13 రోజుల పాటు విద్యార్థులకు సెలవులు రానున్నాయి.తెలంగాణలోని పాఠశాలల్లో 1వ తరగతి నుంచి 10వ తరగతి వరకు విద్యార్థులకు అక్టోబర్ 1వ తేదీ నుంచి 9వ తేదీ వరకు సమ్మేటివ్ అసెస్‌మెంట్-1 పరీక్షలు నిర్వహించనున్నారు. పరీక్షల నిర్వహణలో భాగంగా తరగతుల వారీగా వేర్వేరు సమయాలను విద్యాశాఖ కేటాయించింది. 1వ తరగతి నుంచి 5వ తరగతి వరకు.. ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్షలు జరుగనున్నాయి. 6, 8వ తరగతుల విద్యార్థులకు ఉదయం 9.15 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్షలు నిర్వహిస్తారు. 7వ తరగతి విద్యార్థులకు మధ్యాహ్నం 1.15 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పరీక్ష ఉంటుంది. 9వ తరగతి విద్యార్థులకు మధ్యాహ్నం 1.15 గంటల నుంచి సాయంత్రం 4.15 గంటల వరకు పరీక్షలు నిర్వహించనున్నారు.

# గులాబీ మైండ్ గేమ్ రాజకీయం!

కాంగ్రెస్ పార్టీని డామేజ్ చేసేందుకు కలిసివచ్చే ఏ అంశాన్ని కూడా విడిచిపెట్టడం లేదు ఆ పార్టీ. అసెంబ్లీ గేటు వద్ద జరిగిన ఘర్షణల కేసు దర్యాప్తులో భాగంగా.. బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిఏ కంబాల మహేందర్ రెడ్డి, వీఆర్వో మాణిక్య మహేష్ లు సోమవారం సైఫాబాద్ పోలీస్ స్టేషన్ లో హాజరయ్యారు. అయితే ఆ సందర్భంగా చోటు చేసుకున్న పరిణామాలు తెలంగాణ రాజకీయాల్లో ఓ పక్క ప్రణాళిక బద్ధమైన వ్యూహాత్మక రాజకీయం నడుస్తున్నట్లు స్పష్టమవుతోంది. న్యాయస్థానం ముందస్తు ఉపశమనం ఇస్తూ విచారణకు సహకరించాలని ఆదేశించింది. అయితే వారు ఆ విచారణను రాజకీయ బాధిత ప్రచార ఆయుధంగా మార్చుకున్న తీరు మాత్రం ఆకట్టుకుంటుంది. ఉదయం స్టేషన్ కు వచ్చిన క్షణం నుంచి వెళ్లే వరకు.. జరిగిన పొలిటికల్ డ్రామా హై లెవెల్ లో ఉంది.

**పండుగ పూట వేధింపులు అంటూ..**

పండుగ పూట కూడా వేధిస్తున్నారు అంటూ కాంగ్రెస్ ప్రభుత్వం పై బురద జల్లడమే లక్ష్యంగా గులాబీ పార్టీ వ్యూహం పన్నింది. విచారణ సందర్భంగా అసెంబ్లీ ప్రాంగణానికి తీసుకెళ్లడం.. తిరిగి పోలీస్ స్టేషన్కు తీసుకు రావడం లాంటి చట్టబద్ధమైన ప్రక్రియలను కూడా తమకు అనుకూల వీడియోల చిత్రీకరణకు అవకాశం గా మలుచుకున్నారు. ప్రశాంతంగా సగాల్సిన విచారణ స్థలాన్ని కూడా ఒక హైడ్రామా వేదికగా మార్చేశారు. ఉద్రిక్తతలు సృష్టించే సమాచారంతో సోషల్ మీడియాలో నిరంతర లైవ్ అప్డేట్లు ఇస్తూ పబ్లిక్ అటెన్షన్ ను తమవైపు తిప్పుకోవడంలో గులాబీ పార్టీ పక్కా ప్రణాళికతో ముందుకు సాగింది.



**దాడి అంటూ ఆరోపణలు..**

మరోవైపు విచారణకు హాజరైన వారిపై దాడి చేసేందుకు మాస్కు ధరించిన కొందరు వ్యక్తులు పోలీస్ స్టేషన్ ఆవరణలోకి వచ్చారు అంటూ గులాబీ పార్టీ అగ్రనేతలు ఓ అంశాన్ని తెరపైకి తెచ్చారు. కనీసం ఊహకు అందని ఈ ఆరోపణను సోషల్ మీడియాలో గట్టి ప్రచారం చేశారు. ఏకంగా సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలంటూ కేటీఆర్ స్థాయినేత డిమాండ్ చేశారు. వాస్తవానికి రాష్ట్రంలోనే అత్యంత రక్షణ ఉన్న సైఫాబాద్ పోలీస్ స్టేషన్ లోపలికి వచ్చి దాడి చేసే ధైర్యం ఎవరైనా చేస్తారా? విచారణ సమయంలో దాడికి పూనుకుంటారా? కనీసం ప్రాథమిక విచక్షణను కూడా పక్కన పెట్టి.. తమ పిఎ, వీఆర్వోలను విచారించడానికి కూడా తట్టుకోలేకపోతున్నారు. ఈ మొత్తం ఎపిసోడ్ వెనుక గులాబీ పార్టీ ఆడిన వ్యూహాత్మక మైండ్ గేమ్ స్పష్టంగా అర్థం అవుతుంది. చట్ట ప్రకారం జరిగే సాధారణ విచారణలను సైతం రాజకీయ వేధింపులు అని ముద్ర వేయడం ద్వారా.. భవిష్యత్తులో కేటీఆర్, హరీష్ రావు లాంటి ప్రధాన నేతలను విచారణకు పిలవకుండా పోలీసులపై మానసిక ఒత్తిడి పెంచడమే వీరి ప్రధాన లక్ష్యంగా కనిపిస్తోంది.

**కఠినంగా వ్యవహరించాల్సిందే..**

అయితే పోలీసులు చట్టప్రకారం వ్యవహరిస్తూ.. మెత్తదనంతో సైలెంట్ గా ఉన్న ప్రతిసారి రాజకీయ నాయకులు తమ నేరారోపణల నుంచి తప్పించుకోవడానికి ఎలాంటి మైండ్ గేమ్లు ఆడతారో దీని ద్వారా అర్థం అవుతోంది. ఈ తరహా ప్రచారాలకు చెక్ పెట్టాలంటే కఠినంగా వ్యవహరించాల్సిన అవసరం ఉంది. నిందితులు విచారణను రాజకీయ క్రీడగా మారుస్తున్నప్పుడు.. చట్టం తన పని తాను చేసుకు పోవడమే కాకుండా పోలీస్ యంత్రాంగం కూడా తమ వైపు నుంచి కఠినమైన, పారదర్శకమైన కౌంటర్ స్ట్రాటజీతో వ్యవహరించాల్సిన అవసరం ఉంది.

# మాక్ అసెంబ్లీతో సెల్ఫ్ గోల్!

అయితే దానిని ఒక పొలిటికల్ అస్త్రంగా మార్చుకుంటుంది కాంగ్రెస్. కౌంటర్ ఎటాక్ మొదలుపెట్టింది. మొన్నటికి మొన్న స్పీకర్ గడ్డం ప్రసాద్ ను ఉద్దేశించి తలసాని శ్రీనివాస్ యాదవ్ కీలక వ్యాఖ్యలు చేశారు. దళితులపై అంత ప్రేమ ఉంటే గడ్డం ప్రసాద్ కుమార్ ను సీఎం కుర్చీలో కూర్చోబెట్టవచ్చు కదా అంటూ సవాల్ చేశారు. ఇప్పుడు అదే తలసానిని మాక్ అసెంబ్లీలో సీఎం చైర్ లో కూర్చోబెట్టడాన్ని కాంగ్రెస్ హైలెట్ చేస్తోంది.

**అధికార పార్టీకి అస్త్రం..**

మాక్ అసెంబ్లీని పట్టుకొని ఓ రేంజ్ లో విరుచుకుపడుతోంది కాంగ్రెస్ పార్టీ. మాటలు చెప్పడం కాదు ముందు మీ పార్టీలో అమలు చేయండి. సీఎం సీటులో తలసాని శ్రీనివాస్ యాదవ్ను కూర్చోబెట్టండి అంటూ కాంగ్రెస్ ఎదురు దాడి చేస్తోంది. గులాబీ పార్టీని ఇరుకున పెట్టే ప్రయత్నంలో ఉంది. సీఎం కాకుంటే కనీసం ప్రతిపక్ష నేతలు చేయండి అంటూ సవాల్ విసిరుతోంది. ప్రతిపక్ష నేతగా ఉన్న కేసీఆర్ సభకు హాజరవడం లేదు. ఆ పోస్టు ఖాళీగా ఉంది. అందుకే బీసీ వర్గానికి చెందిన తలసానికి ప్రతిపక్షనేత బాధ్యత ఎందుకు ఇవ్వకూడదు అనే ప్రశ్నను బాగా హైలెట్ చేస్తోంది.

**చాలా అంశాలు తెరపైకి..**

గులాబీ పార్టీ మాక్ అసెంబ్లీ నిర్వహించడం తర్వాత కొన్ని అంశాలు హైలెట్ అవుతున్నాయి. సభకు కేసీఆర్ ఎందుకు హాజరు కావడం లేదని ప్రశ్న ప్రజల్లోకి బలంగా వెళ్ళింది. అసెంబ్లీకి రారు కదా మాకు అసెంబ్లీకి వచ్చి తన అభిప్రాయాన్ని చెప్పే ప్రయత్నం చేయవచ్చు కదా అనే మాట కూడా వినిపించింది. ప్రభుత్వాన్ని ఇరకాటంలో పెట్టేందుకు గులాబీ పార్టీ ప్రయత్నించింది. అయితే ఇప్పుడు అదే గులాబీ పార్టీ కార్నర్ అవుతోంది. ఒకవైపు తలసాని చేసిన దళిత సీఎం కామెంట్స్.. మరోవైపు మాకు అసెంబ్లీలో ఆయనకు సీఎం కుర్చీ.. ఇవన్నీ కలిపి కాంగ్రెస్ పొలిటికల్ కౌంటర్ ఇస్తోంది. మాక్ అసెంబ్లీతో గులాబీ పార్టీకి అనుకున్న మైలేజ్ దక్కలేదు. పైగా కాంగ్రెస్కు రివర్స్ అస్త్రం అందించింది.

# రాజకీయాల్లోకి హైడ్రా రంగనాథ్!

(మొదటి పేజీ తరువాయి)

ప్రధానంగా భూ ఆక్రమణలపై గట్టిగానే ఫోకస్ పెట్టారు. అందుకే కెసిఆర్ సైతం వరంగల్ లాంటి నగరానికి పోలీస్ కమిషనర్ గా రంగనాథ్ ని నియమించారు.

**సీఎం రేవంత్ మద్దతు..**

సీఎం రేవంత్ రెడ్డి మానస పుత్రిక హైడ్రాకు కమిషనర్ గా వ్యవహరిస్తున్నారు రంగనాథ్. హైదరాబాద్ నగరంలో చెరువులను రక్షించారు. కుంటలను బాగు చేశారు. నాలాలను పరిరక్షించారు. ఒక్క మాటలో చెప్పాలంటే విప్లవాత్మక విధానాలకు శ్రీకారం చుట్టారు. కోర్టుల ద్వారా కొంతమంది వ్యక్తులు ఆయనకు వ్యతిరేకంగా వ్యవహరిస్తున్నప్పటికీ.. రంగనాథ్ కు సీఎం రేవంత్ రెడ్డి బలమైన మద్దతు ఉంది. అందుకే కోర్టులకు వెళ్లి మరి ఆయనను కొనసాగించగలుగుతున్నారు.

**మున్నూరు కాపు ఆత్మీయ సమావేశానికి..**

హైడ్రా రంగనాథ్ రాజకీయాల్లోకి వస్తారన్న ప్రచారం జోరుగా సాగుతోంది. దానికి కారణం



హైదరాబాద్ నగరంలో మున్నూరు కాపు ఆత్మీయ సమ్మేళనానికి రంగనాథ్ హాజరయ్యారు. ఆయన మున్నూరు కాపు సామాజిక వర్గానికి చెందినవారు. ఏపీకి చెందిన కూటమి కీలక నాయకులు సైతం ఈ సమావేశానికి హాజరయ్యారు. వారితో వేదిక పంచుకున్నారు. వాస్తవానికి హైడ్రా రంగనాథ్ పై ఒక విమర్శ ఉంది. కుల సంఘాల సమావేశాలకు ఆయన హాజరవుతుంటారు. వీటిపై విమర్శలు వచ్చినా ఆయన పెద్దగా పట్టించుకోరు. అయితే ఇప్పుడు ఏకంగా రాజకీయ నేతలతో ఆయన వేదిక పంచుకోవడంతో పాలిటిక్స్ లోకి వస్తారని ప్రచారం నడుస్తోంది. ప్రధానంగా ఆయన ఎంపీగా పోటీ చేస్తారన్న టాక్ ఉంది. వచ్చే ఎన్నికల్లో ఏపీ నుంచి పోటీ చేస్తారన్న ప్రచారం కూడా ఉంది.

**మెగా ఫ్యామిలీతో సంబంధాలు..**

మెగాస్టార్ ఫ్యామిలీతో రంగనాథ్కు మంచి సంబంధాలు ఉన్నాయి. ఆ కుటుంబానికి అత్యంత ఆప్తుడిగా ముద్రపడ్డారు. గతంలో ఆయన పవన్ కళ్యాణ్ ను కలిసారు కూడా. రాజకీయాల్లోకి వస్తే జనసేనలో చేరే అవకాశం ఉంది. ఆయనకు రాజకీయ ఆసక్తి సైతం ఉందని సన్నిహితులు చెబుతుంటారు. అయితే రాజకీయాలకు సంబంధించి ఎటువంటి ప్రకటనలు చేయలేదు. అయితే గతంలో చాలామంది పోలీస్ ఉన్నతాధికారులు.. వాలంటరీ రిటైర్మెంట్ తీసుకుని మరి రాజకీయాల్లోకి వచ్చారు. మరి హైడ్రా రంగనాథ్ విషయంలో ఏం జరుగుతుందో చూడాలి.

# ఇజ్రాయెల్‌కు అమెరికా భారీ ఆయుధ ప్యాకేజీ

**రూ.26వేల కోట్ల విలువైన ఆయుధాలు సరఫరా!**

**40వేల అత్యంత శక్తిమంతమైన భారీ బాంబులు**

**ఇజ్రాయెల్‌తో అమెరికా రహస్య సమావేశం!**

**ఏడు అరబ్ దేశాల సైనికాధికారులతో భేటీ**

న్యూఢిల్లీ: పశ్చిమాసియాలో ఇరాన్- అమెరికా ఘర్షణ వేళ కీలక పరిణామం చోటు చేసుకుంది. ఇజ్రాయెల్‌కు 2.8 బిలియన్ డాలర్ల (భారత కరెన్సీలో రూ.26 వేల కోట్లు) ఆయుధ ప్యాకేజీని అమెరికా సిద్ధం చేస్తున్నట్లు తెలుస్తోంది. ఈ ఆయుధ ప్యాకేజీలో ఒక్కొక్కటి 900కిలోల బరువున్న 40,000 బాంబులు ఉండనున్నట్లు సమాచారం. ప్రతిపాదిత ప్యాకేజీలో 20,000 వీఖ-84 బాంబులు, 20,000 దీూఖ-117 బాంబులతో పాటు 20 వేలు ×-2000 పెనెట్రేటర్ వార్‌హెడ్‌లు ఉండనున్నాయి. ఇటీవలి సంవత్సరాలలో ఇజ్రాయెల్‌కు అమెరికా ఇంత భారీ మొత్తంలో ఆయుధాలను ఒకేసారి విక్రయించడం ఇదే అయి ఉంటుందని తెలుస్తోంది. ఈ మేరకు అమెరికా అధికారులకు ఉటంకిస్తూ అంతర్జాతీయ మీడియా తన కథనంలో పేర్కొంది.ట్రంప్ ప్రభుత్వం ఇజ్రాయెల్ కోసం 2.8 బిలియన్ డాలర్ల ఆయుధ ప్యాకేజీని సిద్ధం చేస్తోంది. దీనికి యూఎస్ ఫారిన్ మిలిటరీ ఫైనాన్సింగ్ ప్రోగ్రామ్ ద్వారా నిధులు సమకూర్చనున్నారు. ఈ కార్యక్రమం కింద అమెరికన్ ఆయుధాలను కొనుగోలు చేయడానికి ఇజ్రాయెల్‌కు నిధులను వాషింగ్టన్ అందిస్తుంది. ఈ ప్రతిపాదిత ఆయుధ ప్యాకేజీ గత జో బైడెన్, డొనాల్డ్ ట్రంప్ ప్రభుత్వాల హయాంలో ఇచ్చిన ప్యాకేజీని దాటేసింది. ఈ ప్రతిపాదిత ఆయుధ ప్యాకేజీ గురించి అమెరికా కాంగ్రెస్‌లోని సంబంధిత కమిటీలకు అనధికారికంగా సమాచారం అందింది. యూఎస్ సెనేట్ విదేశీ సంబంధాల కమిటీ, అమెరికా హౌస్ విదేశీ వ్యవహారాల కమిటీని ట్రంప్ ప్రభుత్వం సంప్రదించిందని అమెరికా మీడియా తన కథనంలో పేర్కొంది. 2.8 బిలియన్ డాలర్ల ఆయుధ ప్యాకేజీకి ఆమోదం తెలపాలని ఆ కమిటీలను కోరుతోందని స్పష్టం చేసింది. చరిత్రాత్మకంగా ఇజ్రాయెల్‌కు ఆయుధాల అమ్మకాలకు ఉభయపక్షాలు మద్దతు ఇచ్చాయని వెల్లడించింది. అయితే గాజా, ఇరాన్‌లోని సంఘర్షణల నేపథ్యంలో ఇజ్రాయెల్‌కు అమెరికా రక్షణ మద్దతు ఇవ్వడంపై కొంతమంది చట్టసభ సభ్యులు వ్యతిరేకత వ్యక్తం చేశారని చెప్పింది. ఇజ్రాయెల్‌కు అమెరికా సైనిక సాయంపై వాషింగ్టన్‌లో చర్చలు కొనసాగుతున్న నేపథ్యంలో ఈ ప్రతిపాదిత ఆయుధ ప్యాకేజీ సిద్ధం అయ్యిందని తెలిపింది. ఇజ్రాయెల్‌కు అమెరికా రక్షణ సహాయాన్ని నిలిపివేయడానికి మద్దతుగా ఈ ఏడాది జులైలో వంద మందికి పైగా డెమొక్రాట్లు ఓటు వేశారని నివేదించింది.

# రేవంత్ భారీ స్కెచ్!

(మొదటి పేజీ తరువాయి)

కానీ అసెంబ్లీని ప్రత్యేకంగా కొనసాగించడం ద్వారా రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఏదో వ్యూహం పన్నినట్లు అర్థమవుతోంది.

**చీకటి ఒప్పందాలను బయట పెట్టేందుకు..**

ప్రధానంగా భూవివాదాలు, ధరణి చుట్టూ గత ప్రభుత్వ పాలనలో జరిగిన చీకటి ఒప్పందాలను.. అసెంబ్లీ రికార్డుల్లో అధికారికంగా నమోదు చేయించేందుకు సమావేశాలను పొడిగించినట్లు అర్థం అవుతోంది. కాంగ్రెస్ ప్రభుత్వానికి ఇదో అస్త్రంగా మారింది. ఇప్పటికే బిఆర్ఎస్ ఎమ్మెల్యేలపై సస్పెన్షన్ వేటు పడింది. దీంతో ప్రతిపక్షం అనేది లేకుండా పోయింది. మరోవైపు స్పీకర్ వివాదం, అరెస్టులతో వచ్చిన రాజకీయరగడను పక్కకు నెట్టి.. ప్రజలతో నేరుగా ముడిపడి ఉన్న భూ సమస్యల వైపు ప్రజాదృష్టిని మళ్లించేందుకు.. ఏదో అద్భుతమైన అవకాశం. తెలంగాణ సమాజంలో ధరణి పోర్టల్, సెక్షన్ 22ఖ కింద లక్షలాది ఎకరాల పట్టా భూములు నిషేధిత జాబితాలో చిక్కుకున్నాయి. ప్రజలు ఆందోళనతో ఉన్నారు. ఈ సున్నితమైన అంశంపై రేవంత్ రెడ్డి అసెంబ్లీ వేదికగా వివరాలను బహిర్గతం చేస్తే.. బీఆర్ఎస్ పై ఉన్న పాత వ్యతిరేకత మళ్లీ మొదలయ్యే అవకాశం ఉందన్నది ప్రభుత్వ వ్యూహం.

**రెవెన్యూ మంత్రి ప్రకటన..**

ఇప్పటికే రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఈ విషయంపై అసెంబ్లీలో ప్రస్తావించారు. గత ప్రభుత్వం ధరణి పోర్టల్ ను అడ్డం పెట్టుకొని భూ బదలాయింపులు ఎలా జరిపింది? గులాబీ పార్టీ అగ్ర నేతల కుటుంబ సభ్యులకు బదలాయింపు ఎలా జరిగింది? అనే అంశాలను ప్రస్తావించారు. అప్పటి బినామీ బాగోతాన్ని బయటపెట్టారు. ఇప్పుడు ఆ పాత రికార్డులను సీఎం రేవంత్ రెడ్డి సభ ముందు ఉంచే అవకాశాలు కనిపిస్తున్నాయి. గతంలో ధరణి వ్యవహారాలను నడిపిన ఒకరిద్దరు ఉన్నతాధికారులు, కీలక నేతల కనుసన్నల్లోనే వేల కోట్ల విలువైన భూముల నిషేధాలను ఎత్తివేసారని ఆరోపణలు ఉన్నాయి. వాటికి సంబంధించిన సర్వే నంబర్లు, రికార్డుల సవరణ తేదీలు, అక్రమ రిజిస్ట్రేషన్ లో ఫైళ్లను స్వయంగా సీఎం అసెంబ్లీలో ప్రవేశపెట్టి.. ధరణి బండారాన్ని బట్టబయలు చేయనున్నారు అనే ప్రచారం జరుగుతోంది.

**భూభారతి వ్యవస్థ పై స్పష్టం..**

ధరణి పోర్టల్ ద్వారా నాటి గులాబీ పార్టీ అగ్రనేతలు, వారి కుటుంబ సభ్యులు కొల్లగొట్టిన భూముల వివరాలను బయటపెట్టే ఛాన్స్ కనిపిస్తోంది. అదే సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొస్తున్న భూభారతి వ్యవస్థ ద్వారా తాము ఆ సమస్యలను ఎలా పరిష్కరిస్తున్నామో ప్రజలకు వివరించడం రేవంత్ రెడ్డి లక్ష్యంగా కనిపిస్తోంది. నిషేధిత జాబితాలో అన్యాయంగా చిక్కుకుపోయిన నిజమైన రైతుల భూములను విముక్తి చేసేందుకు విధివిధానాలను, కలెక్టర్లకు ఇచ్చిన అధికారాలను వివరిస్తూ.. తాము పరిష్కార కర్తలం అనే ఇమేజ్ను సొంతం చేసుకోవాలని చూస్తున్నారు సీఎం రేవంత్. కేవలం భారత రాష్ట్ర సమితిని డిఫెన్స్ లో పెట్టేందుకే శాసనసభ సమావేశాల పొడిగింపు అనేది స్పష్టమవుతోంది.

# ఎల్లమ్మ బండలోని పలు వినాయక మండపాలను దర్శించుకున్న కాంగ్రెస్ నాయకులు జిల్లా గణేష్



**కూకట్ పల్లి, సెప్టెంబర్ 16 (క్రైమ్ మిర్రర్) :** శేరిలింగంపల్లి నియోజకవర్గం, ఉమ్మడి ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని వినాయక మండపం లో గల విఘ్నేశ్వరుడిని కాంగ్రెస్ నాయకులు జిల్లా గణేష్ దర్శించుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా గణేష్ నేత మాట్లాడుతూ ఎల్లమ్మబండ వినాయక భక్త బృందం ఏర్పాటు చేసిన వినాయకుని దర్శించుకోవడం జరిగిందని, అలాగే ఆల్విన్ డివిజన్ పరిధిలోని అనేక వినాయక మండపాలను అంగరంగ వైభవంగా ముస్తాబు చేసి వినాయక విగ్రహాలను భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించడం జరుగుతుందని, ఆ ఆదిదేవుడు వినాయకుని దివ్యమైన ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని వారు కోరుకున్న కోరిన కోరికలు నెరవేరాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వినాయక మండప సభ్యులు, కాలనీవాసులు, యువకులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# ఆరవ వసంతంలోకి అడుగుపెట్టిన చౌటుప్పల్ కోర్టు

**న్యాయ సేవలో ఐదు సంవత్సరాలు పూర్తి చేసుకున్న చౌటుప్పల్ కోర్టు**

**చౌటుప్పల్ కోర్టు ప్రభుత్వ న్యాయవాది వాకిటి నరసింహారెడ్డి**

**ఐదు సంవత్సరాల మైలురాయి చేరుకున్న చౌటుప్పల్ కోర్టు**



**క్రైమ్ మిర్రర్,యాదాద్రి భువనగిరి జిల్లా బ్యూరో:-** చౌటుప్పల్ కోర్టు నేటితో ఐదు సంవత్సరాల న్యాయ సేవలను పూర్తిచేసుకుని ఆరవ పడిలోకి అడుగుపెట్టడం సంతోషంగా ఉందని చౌటుప్పల్ కోర్టు ప్రభుత్వ న్యాయవాది వాకిటి నరసింహారెడ్డి అన్నారు. చౌటుప్పల్ మండల కేంద్రంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రామన్నపేటలో కోర్టు ఉండటంతో, చౌటుప్పల్ నుంచి వ్యయ ప్రయాసలకోర్చి ప్రజలు కోర్టు కేసులకు వెళ్లేవారన్నారు. చిన్నచిన్న కేసుల్లో సైతం చౌటుప్పల్ పరిసర ప్రాంతాల ప్రజలు రామన్నపేట కోర్టుకు వెళ్లి ఉదయం నుంచి సాయంత్రం వరకు అక్కడే ఉండి వచ్చే వారని గుర్తు చేశారు. జాతీయ రహదారి వెంట, పరిసర మండలాల ప్రజలకు అనువైనదిగా ఉన్న చౌటుప్పల్ లో ఏర్పాటు చేయాలని ప్రతిపాదన, 2021సెప్టెంబర్ 16వ తేదీన చౌటుప్పల్ లో కోర్టు ఏర్పాటు అయిందన్నారు. దినదినాభివృద్ధి చెందుతున్న చౌటుప్పల్ మండల కేంద్రంలో చౌటుప్పల్ జూనియర్ సివిల్ కోర్టు 2021లో ప్రారంభమై, నేటికి విజయవంతంగా ఐదు సంవత్సరాల న్యాయ సేవా ప్రస్థానాన్ని పూర్తి చేసుకుంది. ఈ ఐదేళ్ల కాలంలో స్థానిక ప్రజలకు వేగవంతమైన, పారదర్శకమైన, సులభతరమైన న్యాయ సేవలను అందించడంలో ఈ కోర్టు కీలక పాత్ర పోషించింది. 2021లో ఏర్పాటైన నాటి నుంచి చౌటుప్పల్ పరిసర ప్రాంతాల ప్రజలకు సుదీర్ఘ దూరాలు ప్రయాణించాల్సిన అవసరం లేకుండా స్థానికంగానే న్యాయం చేకూరుతోందన్నారు. గత ఐదేళ్లలో ఎన్నో సివిల్ మరియు క్రిమినల్ కేసులను చట్టపరంగా, నిష్పక్షపాతంగా పరిష్కరించి బాధితులకు త్వరితగతిన న్యాయం అందించడం జరిగిందన్నారు. కోర్టు పరిధిలో చట్టాలపై ప్రజలకు, మహిళలకు, యువతకు అవగాహన కల్పించేందుకు పలు ఉచిత న్యాయ విజ్ఞాన సదస్సులు విజయవంతంగా నిర్వహించబడ్డాయన్నారు. రాజీపడదగ్గ వివాదాలను సామరస్యపూర్వకంగా పరిష్కరించేందుకు ప్రత్యేక లోక్ అదాలత్ కార్యక్రమాలను సమర్థవంతంగా నిర్వహించి, కోర్టులపై కేసుల భారాన్ని తగ్గించడంలో ఈ న్యాయస్థానం ఎంతో కృషి చేసిందన్నారు. ఈ ఐదేళ్ల విజయవంతమైన ప్రస్థానానికి సహకరించిన న్యాయమూర్తులు, కోర్టు సిబ్బంది, లాయర్లు, పోలీస్ శాఖ, స్థానిక ప్రజలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. రాబోయే రోజుల్లోనూ ఇదే విధమైన పారదర్శకతతో, మరింత వేగంగా ప్రజలకు న్యాయ సేవలు అందించేందుకు కోర్టు నిరంతరం కట్టుబడి ఉంటుందని స్పష్టం చేశారు.

# వినాయక చవితి సందర్భంగా పద్మావతి ప్లాజాలో అన్నదానం

**భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదల స్వీకరణ**



**కూకట్‌పల్లి, సెప్టెంబర్ 16 (క్రైమ్ మిర్రర్) :** వినాయక నవరాత్రుల సందర్భంగా కూకట్‌పల్లి పద్మావతి ప్లాజాలో ‘ప్లాజా కా రాజా’ పేరుతో కొలువుదీరిన గణనాథుడి సన్నిధిలో బుధవారం భక్తుల కోసం అన్నదాన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. పద్మావతి ప్లాజా గ్రౌండ్ ఫ్లోర్‌లో శివకృష్ణ--న్యూ వెంకటేశ్వర మొబైల్స్, రాఘవ--రవిచంద్ర మొబైల్స్, భాస్కర్--భాస్కర్ మొబైల్స్, వెంకట్‌రెడ్డి--ఏ.జె. మొబైల్స్, ప్రసాద్--ప్రసాద్ మొబైల్ ఫిక్సర్, రాజేష్--బాంబే డైయింగ్ వారి సహకారంతో అన్నసమారాధన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి భక్తులు, స్థానికులు, వ్యాపారులు పెద్ద సంఖ్యలో హాజరై అన్నప్రసాదాన్ని స్వీకరించారు. భక్తిశ్రద్ధలతో నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో నిర్వాహకులు, వ్యాపారులు పాల్గొని భక్తులకు ప్రసాద వితరణ చేశారు. వినాయకుని ఆశీస్సులతో ప్రజలందరూ సుఖశాంతులతో, ఆయురారోగ్యాలతో, ఆనందంగా ఉండాలని నిర్వాహకులు ఆకాంక్షించారు. ఈ సందర్భంగా భక్తులు, స్థానిక ప్రజలకు వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపారు.

# మూసాపేట్‌లో ఘనంగా వినాయక చవితి వేడుకలు

**వినాయకుడి పూజల్లో పాల్గొని అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించిన బండి రమేష్**



**కూకట్ పల్లి, సెప్టెంబర్ 16 (క్రైమ్ మిర్రర్) :** కూకట్ పల్లి నియోజకవర్గం, మూసాపేట్ డివిజన్‌లో తూము రజినీకాంత్ ఆధ్వర్యంలో వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని వినాయకుడి ప్రత్యేక పూజా కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి టీపీసీసీ ఉపాధ్యక్షులు, కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ బండి రమేష్ ముఖ్య అతిథిగా హాజరై వినాయకుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తుల కోసం ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొని, నిర్వాహకులను అభినందించారు. ఈ సందర్భంగా బండి రమేష్ మాట్లాడుతూ, వినాయక చవితి పండుగ ప్రజలందరిలో భక్తి, ఐక్యత, సోదరభావాన్ని పెంపొందించాలని ఆకాంక్షించారు. ప్రతి ఒక్కరి జీవితంలో సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, విజయాలు కలగాలని విఘ్నేశ్వరుడిని ప్రార్థించారు.ఈ కార్యక్రమంలో పుష్పారెడ్డి, తూము సంతోష్, ఎల్లారావు, సతీష్ గౌడ్, కర్రెమ్మ, ఇజాజ్, వాసు తదితరులు పాల్గొన్నారు.



# బీఆర్ఎస్ నేతలు ప్రభుత్వం పై దుష్ప్రచారం చేసి ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారు

**కాంగ్రెస్ ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్‌పర్సన్ కాల్వ సుజాత**



**క్రైమ్ మిర్రర్, మల్కాజిగిరి :** బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు తాము అధికారంలో ఉన్న సమయంలో చేసిన తప్పులను కప్పిపుచ్చుకునేందుకు కాంగ్రెస్ ప్రభుత్వంపై బురదజల్లుతూ, ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను అడ్డుకునేందుకు ప్రయత్నిస్తున్నారని కాంగ్రెస్ ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్‌పర్సన్, టీపీసీసీ అధికార ప్రతినిధి, మల్కాజిగిరి జిల్లా కోఆర్డినేటర్ కాల్వ సుజాత విమర్శించారు. బుధవారం మల్కాజిగిరి ఆనంద్‌బాగ్‌లోని మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు క్యాంపు కార్యాలయంలో కాంగ్రెస్ నాయకులతో కలిసి నిర్వహించిన విలేకరుల సమావేశంలో జిల్లా కోఆర్డినేటర్ గా మల్కాజిగిరి కి వచ్చిన సందర్భంగా పలువురు వారిని సత్కరించారు. సమావేశంలో ఆమె మాట్లాడారు పీసీసీ ఆదేశాల మేరకు జిల్లా, మండల, డివిజన్ స్థాయిలో కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించడంతో పాటు ప్రతిపక్షాల దుష్ప్రచారాన్ని ప్రజలకు తెలియజేసేందుకు జిల్లా కోఆర్డినేటర్‌గా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అసెంబ్లీ సమావేశాల సందర్భంగా బీఆర్ఎస్ నేతలు చేస్తున్న హంగామా, కాంగ్రెస్ ప్రభుత్వ వెయ్యి రోజుల పాలనపై చేస్తున్న విమర్శలను ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. మీడియా దృష్టిని ఆకర్షించేందుకు అసెంబ్లీ పరిసరాల్లో చేసిన హంగామాకు సంబంధించిన వీడియోలు, ఫొటోలు బయటకు రావడంతో వాస్తవాలు ప్రజలకు అర్థమయ్యాయని పేర్కొన్నారు. వాటిని కృత్రిమ మేధస్సు (ఏఐ) సృష్టించినవిగా పేర్కొంటూ తప్పించుకునే ప్రయత్నం చేయడం సరికాదన్నారు. ప్రజా సమస్యలపై చర్చించాల్సిన ప్రతిపక్షాలు సభలో గందరగోళం సృష్టిస్తూ రాజకీయ డ్రామాలకు పాల్పడుతున్నాయని కాల్వ సుజాత ఆరోపించారు. గతంలో ఇచ్చిన హామీలను విస్మరించిన వారు ఇప్పుడు ప్రజా సమస్యలపై మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. 22ఏ భూముల సమస్యపై ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, సామాన్య ప్రజలకు నష్టం కలగకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. ఈ అంశంపై ముఖ్యమంత్రి సభలో వివరాలు వెల్లడించేందుకు సిద్ధంగా ఉన్నప్పటికీ ప్రతిపక్ష సభ్యులు సభకు హాజరుకాకుండా తప్పించుకుంటున్నారని విమర్శించారు. మల్కాజిగిరి నియోజకవర్గంలో ఎస్ఐఆర్ ప్రక్రియ 62.5 శాతం పూర్తికావడం సానుకూల పరిణామమన్నారు. ఇంకా 20 రోజుల సమయం ఉన్నందున అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకునేలా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని సూచించారు. ఒక్క అర్హుడైన ఓటరు కూడా ఓటు హక్కు కోల్పోకుండా చూడాలని పిలుపునిచ్చారు. మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు సహకారంతో నియోజకవర్గంలో ఎస్ఐఆర్ ఇన్‌చార్జి షమీర్ కౌశల్, బీఎల్‌ఏలు సమన్వయంతో పనిచేస్తున్నారని తెలిపారు. సమావేశంలో కాంగ్రెస్ నాయకులు లక్ష్మీకాంత్‌రెడ్డి, వెంకటేష్ యాదవ్, బీకే శ్రీనివాస్, గుండా నిరంజన్, జీడి సంపత్ గౌడ్, వినోద్ యాదవ్, ప్రవీణ్,రాందాస్ సంతోష్ ముదిరాజ్ ఎస్సీ సెల్ జిల్లా కార్యదర్శి మంద భాస్కర్ మాదిగ, సుంకు శ్రీనివాస్, పిట్ల నాగరాజు, అరుణ్, ఆశా, లక్ష్మి, పార్థసారథి, నరేష్, వెంకటేష్, కుమార్, చుంకూ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



# సింగరేణి సూపర్‌బజార్ ఎల్‌పీజీ సిబ్బందికి జీఎం అభినందనలు

**మందమర్రి, సెప్టెంబర్ 16 (క్రైమ్ మిర్రర్) :** సింగరేణి సూపర్‌బజార్ ద్వారా వినియోగదారులకు ఎల్‌పీజీ సేవలను అత్యంత సమర్థవంతంగా, పారదర్శకంగా అందిస్తున్న సిబ్బందిని మందమర్రి ఏరియా జీఎం ఎన్. రాధాకృష్ణ అభినందించారు. బుధవారం ఏరియా జీఎం కార్యాలయంలో సూపర్‌బజార్ డివిజనల్ మేనేజర్ పాలకుర్తి రాజుతో పాటు ప్రతినిధులను ఆయన ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ.. ఎల్‌పీజీ సేవల్లో నాణ్యత, పారదర్శకత పాటిస్తున్నందుకు హైదరాబాద్‌లోని ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ అధికారులు డివిజనల్ మేనేజర్ రాజును ప్రత్యేకంగా సత్కరించినట్లు తెలిపారు. రామకృష్ణాపూర్, బెల్లంపల్లి, మందమర్రి, శ్రీరాంపూర్ ప్రాంతాల్లో వినియోగదారులకు మెరుగైన సేవలు అందిస్తూ సిబ్బంది నమ్మకాన్ని నిలబెట్టుకుంటున్నారని కొనియాడారు. భవిష్యత్తులోనూ ఇదే స్ఫూర్తిని కొనసాగించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డీజీఎం (పర్సనల్) సి. హెచ్. అశోక్, సూపర్‌బజార్ బ్రాంచ్ మేనేజర్ సుదర్శన్, కో-ఆర్డినేటర్ భూపతి శ్రీనివాసరాజు తదితరులు పాల్గొన్నారు.

# రూ.10 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన

**మంత్రి ఉత్తమ్ సహకారంతో గ్రామ అభివృద్ధిని ముందుకు తీసుకెళ్తాం**

**సింగారం గ్రామ సర్పంచ్ భూపాల్ రెడ్డి**



**క్రైమ్ మిర్రర్, పాలకీడు:** సూర్యాపేట జిల్లా పాలకీడు మండలంలోని మూసి ఒడ్డు సింగారం గ్రామంలో రాష్ట్ర మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సహకారంతో మంజూరైన రూ. 10 లక్షల సిసి రోడ్ నిర్మాణ పనులను బుదవారం గ్రామ సర్పంచ్ భూపాల్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మంత్రి ఉత్తమ్ సహకారంతో గ్రామాల సమస్యలు పరిష్కారం అవుతున్నాయని, గ్రామాల అభివృద్ధే ఉత్తమ్ ధ్యేయం అని అన్నారు. మంత్రి ఉత్తమ్ సహకారంతో గ్రామ అభివృద్ధిని ముందుకు తీసుకెళ్తాం అన్నారు. గ్రామంలో 10 లక్షలతో సిసి రోడ్లు వెడల్పు నిర్మాణం చేపట్టేందుకు సహకరిస్తున్న గ్రామ ప్రజలందరికీ ధన్యవాదములు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉప సర్పంచ్ చిలక ఉమాబాబు , వార్డు సభ్యులు, పంచాయతీ సెక్రెటరీ పద్మజ, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# విమోచనా దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించాలి

**బీజేపీ మండల అధ్యక్షుడు రమావత్ నరి నాయక్**




**క్రైమ్ మిర్రర్,పాలకీడు :** తెలంగాణ విమోచన దినోత్సవాన్ని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని బీజేపీ మండల అధ్యక్షుడు రమావత్ నరి నాయక్ కోరారు. భారతీయ జనతా పార్టీ రాష్ట్ర శాఖ పిలుపు మేరకు జిల్లా అధ్యక్షురాలు చల్లా శ్రీలత రెడ్డి ఆదేశానుసారం తెలంగాణ విమోచన దినోత్సవాన్ని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని భారతీయ జనతా పార్టీ పాలక వీడు మండల పార్టీ అధ్యక్షులు ఆధ్వర్యంలో డిప్యూటీ తహశీల్దార్ సైదా హుస్సేన్ కి వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూదేశానికి 1947 ఆగస్టు 15న స్వాతంత్ర్యం వస్తే, తెలంగాణ ప్రాంతానికి మాత్రం నిజాం, రజాకార్ల నిరంకుశ పాలన నుండి 1948 సెప్టెంబర్ 17న విముక్తి లభించిందని, ఈ చారిత్రక రోజును రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా తెలంగాణ విమోచన దినోత్సవంగా నిర్వహించాలని డిమాండ్ చేశారు. సెప్టెంబర్ 17న మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు మరియు ప్రభుత్వ కార్యాలయాలలో విమోచన దినోత్సవాన్ని పురస్కరించుకుని అధికారికంగా జాతీయ జెండాను ఆవిష్కరించాలని కోరారు. ఓటు బ్యాంకు రాజకీయాలు వీడాలనీ గత ప్రభుత్వాల తరహాలోనే ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కూడా ఒక వర్గం ఓట్ల కోసం, ఎంఐఎం పార్టీకి భయపడి విమోచన దినోత్సవాన్ని అధికారికంగా జరపడానికి వెనకాడుతోందని, ఈ ఓటు బ్యాంకు రాజకీయాలను పక్కనబెట్టి అమరవీరుల త్యాగాలను గౌరవించాలని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో మహిళా మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి గజగంటి రమణ పాలకవీడు బూత్ అధ్యక్షులు కొండ శ్రీనివాస్ గౌడ్, మండల మహిళా మోర్చా నాయకురాలు కొమ్మగాని అచ్చమ్మ , విద్యాసాగర్, నాయకులు , కార్యకర్తలు పాల్గొన్నారు.

# సంక్షేమ పథకాలు అర్హులకు అందేలా చూడాలి

**పథకాల అమల్లో రాజకీయ జోక్యం వద్దు**

**హుజుర్నగర్ నియోజకవర్గ బీఆర్ఎస్ నాయకులు రాపోలు నవీన్**



**క్రైమ్ మిర్రర్ , నేరేడుచర్ల:** ప్రభుత్వ సంక్షేమ పథకాలు కేవలం ఒక పార్టీ కి చెందిన వారికి మాత్రమే వర్తింప చేస్తున్నారని రాజకీయ నాయకులకు అధికారులు కూడా అసంబద్ధమైన నిర్ణయాలు చేస్తున్నారని బిఆర్ఎస్ నియోజకవర్గ నాయకులు రాపోలు నవీన్ కుమార్ ఆరోపించారు. బుధవారం సూర్యాపేట జిల్లా నేరేడుచర్ల మండల పరిషత్ కార్యాలయం ముందు బిఆర్ఎస్ శ్రేణులతో కలిసి నిరసన కార్యక్రమం చేపట్టిన అనంతరం ఆయన మాట్లాడుతూ మండలంలోని పలు గ్రామాలలో ఫేస్ వన్ ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల జాబితాలో పేర్లు వచ్చిన వాళ్ళను పక్కకు పెట్టి తమకు ఇష్ట వచ్చిన వారిని జాబితాలో చేర్చి నిజమైన పేదలకు అర్హులైన వారికి అన్యాయం చేస్తున్న నేటి ప్రభుత్వం తీరును ప్రతి ఒక్కరు ఎండగట్టాలని గతంలో అధికారంలో ఉన్న బిఆర్ఎస్ పార్టీ సంక్షేమ పథకాలను అన్ని వర్గాల వారికి సమానంగా అందజేసిందని రైతు భీమా, రైతు బంధు ,కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ లాంటి అనేక సంక్షేమ పథకాలు రాజకీయాలకు అతీతంగా అర్హులందరికీ అందించారని అందులో అధికార పార్టీ వారు కూడా అనేక మంది ఉన్నారన్న విషయాన్ని మరిచిపోతే ఎలా అని ఆయన ప్రశ్నించారు. నిరుపేదల నోట్లో మట్టి కొడితే ఏమొస్తుందని కాకపోతే కొద్దిసేపు పైశాచిక ఆనందం అనుభవించడం తప్ప పేదల దరి చేరని సంక్షేమ పథకాలు ఉంటే ఎంత లేకపోతే ఎంత అని మాట్లాడారు ఈ కార్యక్రమంలో నేరేడుచర్ల మండల బిఆర్ఎస్ పార్టీ మాజీ ప్రధాన కార్యదర్శి యల్లావుల లింగయ్య యాదవ్, పెంచికల్ దిన్న సర్పంచ్ నర్సింగ్, చిన్న సోమయ్య, దాసరం సర్పంచ్ చింతకుంట్ల విరా రెడ్డి, నాయకులు తకెళ్ళ నాగార్జున, షేక్ నాగుల్ మీరా, మహబూబ్ అలీ, కొప్పు గౌతమ్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## బైక్ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన యువకుడి చికిత్సకు 2 లక్షల తక్షణ ఆర్థిక సాయం చేసిన మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి



**క్రైమ్ మిర్రర్,సశీస్థాన్ నారాయణపురం:-** యాదాద్రి భువనగిరి జిల్లా సశీస్థాన్ నారాయణపురం మండలం డాకుతండా గ్రామపంచాయతీ పరిధిలోని కోపుల తండా కు చెందిన మెగావత్ రాకేష్ తండ్రి జయ సింగ్, బైక్ ప్రమాదంలో తీవ్రంగా గాయపడడంతో రాకేష్ గాయపడ్డ విషయాన్ని స్థానిక శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి దృష్టికి తీసుకువచ్చిన స్థానిక నాయకులు... మెరుగైన చికిత్స అందించి బతికించాలంటూ తక్షణమే రెండు లక్షల ఆర్థిక సహాయం చేసిన మునుగోడు శాసనసభలు కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి .రెండు లక్షల రూపాయల చెక్కును హైదరాబాదులోని ఆసుపత్రికి వెళ్లి రాకేష్ తల్లిదండ్రులకు అందజేశారు. కాంగ్రెస్ పార్టీ మండల పార్టీ అధ్యక్షులు కరెంటోత్ శ్రీనివాస్ నాయక్, దోనూరి జైపాల్ రెడ్డి, గుత్త ప్రేమ్చందర్ రెడ్డి, బిక్షపతి నాయక్, కిషన్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# వినాయక చవితి సందర్భంగా పద్మావతి ప్లాజాలో అన్నదానం

**భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదల స్వీకరణ**



**కూకట్‌పల్లి, సెప్టెంబర్ 16 (క్రైమ్ మిర్రర్) :** వినాయక నవరాత్రుల సందర్భంగా కూకట్‌పల్లి పద్మావతి ప్లాజాలో 'ప్లాజా కా రాజా' పేరుతో కొలువుదీరిన గణనాథుడి సన్నిధిలో బుధవారం భక్తుల కోసం అన్నదాన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. పద్మావతి ప్లాజా గ్రౌండ్ ఫ్లోర్‌లో శివకృష్ణ--న్యూ వెంకటేశ్వర మొబైల్స్, రాఘవ--రవిచంద్ర మొబైల్స్, భాస్కర్--భాస్కర్ మొబైల్స్, వెంకట్‌రెడ్డి--ఏ.జె. మొబైల్స్, ప్రసాద్--ప్రసాద్ మొబైల్ ఫిక్సర్, రాజేష్--బాంబే డైయింగ్ వారి సహకారంతో అన్నసమారాధన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి భక్తులు, స్థానికులు, వ్యాపారులు పెద్ద సంఖ్యలో హాజరై అన్నప్రసాదాన్ని స్వీకరించారు. భక్తిశ్రద్ధలతో నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో నిర్వాహకులు, వ్యాపారులు పాల్గొని భక్తులకు ప్రసాద వితరణ చేశారు. వినాయకుని ఆశీస్సులతో ప్రజలందరూ సుఖశాంతులతో, ఆయురారోగ్యాలతో, ఆనందంగా ఉండాలని నిర్వాహకులు ఆకాంక్షించారు. ఈ సందర్భంగా భక్తులు, స్థానిక ప్రజలకు వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపారు.

# మహా పాదయాత్రను విజయవంతం చేయాలి



**క్రైమ్ మిర్రర్ చేవెళ్ల, సెప్టెంబర్ 16:** బడుగు, బలహీన వర్గాలకు రాజ్యాధికారం సాధించడమే లక్ష్యంగా తెలంగాణ రాజ్యాధికార పార్టీ అధ్యక్షులు తీన్మార్ మల్లన్న ఆధ్వర్యంలో సెప్టెంబర్ 17న గోల్కొండ కోట నుంచి నిర్వహించనున్న మహా పాదయాత్రను విజయవంతం చేయాలని ఆ పార్టీ చేవెళ్ల నియోజకవర్గ అధ్యక్షులు కున్మర్తి అశోక్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సమాజంలోని బడుగు, బలహీన వర్గాలకు రాజకీయంగా సముచిత ప్రాతినిధ్యం, రాజ్యాధికారం కల్పించాలనే లక్ష్యంతో తీన్మార్ మల్లన్న ఆధ్వర్యంలో ఈ మహా పాదయాత్ర నిర్వహిస్తున్నట్లు తెలిపారు. చేవెళ్ల నియోజకవర్గంలోని అన్ని వర్గాల ప్రజలు, ముఖ్యంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాల నాయకులు, కార్యకర్తలు, యువత, విద్యార్థులు మరియు బహుజన వర్గాల ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని పాదయాత్రకు మద్దతు ప్రకటించాలని కోరారు. బహుజన వర్గాల హక్కులు, రాజకీయ సాధికారత కోసం చేపడుతున్న ఈ ఉద్యమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కున్మర్తి అశోక్ పిలుపునిచ్చారు. ప్రజల ఐక్యతతో మహా పాదయాత్రను విజయవంతం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# విద్యాభివృద్ధికి “దివిస్” సహకారం




**క్రైమ్ మిర్రర్,సంస్థాన్ నారాయణపురం:-** ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాభివృద్ధికి దివిస్ లేబరేటరీస్ అందిస్తున్న సహకారాన్ని సద్వినియోగం చేసుకోవాలని సంస్థాన్ నారాయణపురం మండల విద్యాధికారి గోలి శ్రీనివాసులు సూచించారు. మండల పరిధిలోని కోతులాపురంలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు దివిస్ లేబరేటరీస్ సమకూర్చిన రూ. 57,250 విలువైన 1554 నోటు పుస్తకాలను ఆ గ్రామ సర్పంచి కురుమిద్ద వినోద చేతుల మీదుగా విద్యార్థులకు బుధవారం పంపిణీ చేశారు. కోతులాపురం, అల్లం దేవి చెరువు గ్రామాలలోని ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు దివిస్ లేబరేటరీ ఆధ్వర్యంలో బుధవారం ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించారు. డాక్టర్ జయంత్ కుమార్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన ఔషధాలను, బలవర్ధక టానిక్కులను సర్పంచి వినోద, మండల విద్యాధికారి శ్రీనివాస్ చేతుల మీదుగా విద్యార్థులకు పంపిణీ చేశారు. ఉప సర్పంచి పి. నరసింహ, వార్డు సభ్యులు జి. యాదగిరి, ప్రధానోపాధ్యాయులు చంద్రశేఖర్, కనక సేన, దివిస్ ప్రతినిధులు గోపి చౌదరి, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# మెగా జాబ్ మేళా ను యువత సద్వినియోగము చేసుకోవాలి

**కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షులు కట్ట మల్లారెడ్డి**



**నూతనకల్ ( క్రైమ్ మిర్రర్):** నిరుద్యోగ యువతకు వేలాది ఉద్యోగ అవకాశాలు కల్పించి, వారి భవిష్యత్తుకు భరోసా కల్పించడమే లక్ష్యంగా జరిగే మెగా జాబ్ మేళా ను సద్వినియోగం చేసుకోవాలని కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కట్ట మల్లారెడ్డి కోరారు. బుధవారం ఒక ప్రకటనలో తెలిపుతూ ఈనెల 19న మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతి ఆధ్వర్యంలో కోదాడలో మెగా జాబ్ మేళా నిర్వహించనున్నారు. 200--250 కంపెనీలు,వేలాది ఉద్యోగ అవకాశాలు ఉంటాయని తెలిపారు. నూతనకల్ మండల యువత ఉద్యోగ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోని ఉపాధిని పోందాలని కోరారు.

# బీఆర్ఎస్ పోరాటానికి
# తలొగ్గిన నిర్ణయం.!!



## మహాదేవపూర్‌లో పునరుద్ధరించిన గ్యాస్ ఏజెన్సీ

### గ్యాస్ ఏజెన్సీ సేవలు మళ్లీ ప్రారంభం

### బీఆర్ఎస్ నేతల ఆందోళనలకు మండల ప్రజల్లో హర్షం

**క్రైమ్ మిర్రర్, భూపాలపల్లి ప్రతినిధి:** జయశంకర్ జిల్లా మహాదేవపూర్ మండల కేంద్రంలోని గిరిజన సహకార సంస్థ ఆధ్వర్యంలో కొనసాగుతున్న హెచ్ పి గ్యాస్ ఏజెన్సీ ఎత్తివేతకు వ్యతిరేకంగా బీఆర్ఎస్ పార్టీ చేపట్టిన ఆందోళనలు, నిరసనలు ఫలించాయి. బీఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ బాధ్యులు, మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు ఆదేశాల మేరకు పార్టీ నాయకులు, కార్యకర్తలు గ్యాస్ ఏజెన్సీని కొనసాగించాలంటూ ప్రజల తరఫున పలు కార్యక్రమాలు చేపట్టారు. ఈ క్రమంలో గ్యాస్ ఏజెన్సీ సేవలు నేటి నుంచి తిరిగి యథావిధిగా కొనసాగుతున్నట్లు నాయకులు తెలిపారు. గ్యాస్ ఏజెన్సీ సేవలు నిలిచిపోవడం లేదా ఎత్తివేయడం వల్ల మండల ప్రజలు ఎదుర్కొనే ఇబ్బందులను ప్రభుత్వం, అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో పాటు సమస్య పరిష్కారం కోసం బీఆర్ఎస్ నాయకులు నిరంతరం పోరాటం చేశారని పేర్కొన్నారు. తమ పార్టీ చేపట్టిన ఉద్యమం, ప్రజల మద్దతు ఫలితంగానే గ్యాస్ ఏజెన్సీ పునరుద్ధరణ జరిగిందని నాయకులు తెలిపారు. గ్యాస్ ఏజెన్సీ సేవలు తిరిగి ప్రారంభం కావడంతో మండల ప్రజలకు గ్యాస్ సిలిండర్ల కోసం దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన ఇబ్బందులు తగ్గనున్నాయని, ప్రజలకు అందుబాటులోనే సేవలు కొనసాగనున్నాయని తెలిపారు. దీంతో మండల ప్రజల్లో హర్షం వ్యక్తమవుతోందని నాయకులు పేర్కొన్నారు. ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా బీఆర్ఎస్ పార్టీ ముందుకు సాగుతుందని, ప్రజల దీవెనలు, సహకారంతో భవిష్యత్తులోనూ ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటాలు కొనసాగిస్తామని నాయకులు తెలిపారు. గ్యాస్ ఏజెన్సీ పునరుద్ధరణ కోసం చేపట్టిన పోరాటానికి వార్తలను ప్రచురించి, ప్రజల సమస్యను వెలుగులోకి తీసుకువచ్చిన ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండల నాయకులు, మాజీ సర్పంచ్ శ్రీపతిబాపు, కేదారి గీత, అలీం ఖాన్, చిల్ల కుమార్, వెన్నంపల్లి మహేష్, కడార్ల రాజబాపు, తోట మనోజ్, కడారి రమేష్, కావేరి దుర్గయ్య, రాజు, సతీష్ తదితరులు పాల్గొన్నారు.


క్రైమ్ మిర్రర్
Voice of Anti Corruption

గ్యాస్ గోదాం తరలిస్తే ఊరుకునేది లేదు : బీఆర్ఎస్

- మహాదేవపూర్‌లో బీఆర్ఎస్ నాయకుల ధర్నా
- భూపాలపల్లికి తరలింపు నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్

క్రైమ్ మిర్రర్, భూపాలపల్లి ప్రతినిధి: జయశంకర్ జిల్లా మహాదేవపూర్ మండల కేంద్రంలో కొనసాగుతున్న జీసీసీ గ్యాస్ గోదాంను భూపాలపల్లికి తరలించే నిర్ణయాన్ని నిరసిస్తూ బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. గ్యాస్ గోదాంను భూపాలపల్లికి తరలిస్తే కాటారం డివిజన్ పరిధిలోని ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని అన్నారు. ఇప్పటికే మారుమూల ప్రాంతాల ప్రజలు గ్యాస్ కోసం దూర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తుండగా, గోదాం మరింత దూరానికి తరలిస్తే సామాన్యులపై అదనపు భారం పడుతుందని పేర్కొన్నారు. మహాదేవపూర్ కేంద్రంగా గ్యాస్ గోదాం కొనసాగించడం వల్ల చుట్టుపక్కల గ్రామాల ప్రజలకు సౌకర్యంగా ఉంటుందని తెలిపారు. ప్రజా ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని గోదాం తరలింపు నిర్ణయాన్ని ప్రభుత్వం పునఃపరిశీలించి, మహాదేవపూర్‌లోనే కొనసాగించాలని డిమాండ్ చేశారు. తరలింపు నిర్ణయాన్ని విరమించుకోకపోతే ప్రజలను సమీకరించి మరింత పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని నాయకులు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ శ్రీపతి బాపు, కేదారి గీత, యండి అలీమ్ ఖాన్, పోత వెంకటస్వామి, కలికోట దేవేందర్, తోట సుధాకర్, అరుణ, స్వప్న, అడప మల్లయ్య, కూరతోట రాకేష్, పెండ్యాల నర్సింహస్వామి తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

Crime Mirror Telugu Daily Newspaper
Date: 13 Sep 2026
Page: 4


# ప్రకృతిని కాపాడేందుకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి

### ప్రాణవాయువును అందించే చెట్లు మానవాళి మనుగడకు ఎంతో అవసరం.. పర్వేద సర్పంచ్, మండల సర్పంచుల సంఘం అధ్యక్షులు సురేందర్ గౌడ్





**క్రైమ్ మిర్రర్ శంకర్‌పల్లి:** ప్రాణవాయువును అందించే చెట్లు, మొక్కలు మానవాళి జీవన మనుగడకు ఎంతో అవసరమని, పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని పర్వేద గ్రామ సర్పంచ్, మండల సర్పంచుల సంఘం అధ్యక్షులు సురేందర్ గౌడ్ అన్నారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని ఆయన పిలుపునిచ్చారు. బుధవారం శంకర్‌పల్లి మండలంలోని పర్వేద గ్రామంలో రాముని గుడి, పోచమ్మ గుడి వద్ద దైవవృక్షాలు, పూల మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. శంకర్‌పల్లి సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో, బీజేపీ ఎండోమెంట్ ధార్మిక సెల్ ప్రోత్సాహంతో చేపట్టిన ఈ కార్యక్రమంలో సర్పంచ్ సురేందర్ గౌడ్ ప్రత్యేకంగా పాల్గొని మొక్కలు నాటారు. ఈ సందర్భంగా సర్పంచ్ సురేందర్ గౌడ్ మాట్లాడుతూ, ప్రకృతిని పరిరక్షించాలనే సంకల్పంతో గ్రామాల్లోని ఆలయాల వద్ద మొక్కలు నాటుతున్న కార్యక్రమాలను అభినందించారు. ఇప్పటికే గుబ్బడి, పత్తేపురం, ఎల్లకొండ గ్రామాల్లో మొక్కలు నాటే కార్యక్రమాలు నిర్వహించి, తాజాగా పర్వేద గ్రామంలో కూడా ఆలయాల వద్ద దైవవృక్షాలు, పూల మొక్కలు నాటడం అభినందనీయమన్నారు. మొక్కలను నాటడమే కాకుండా వాటిని సంరక్షించే బాధ్యతను కూడా ప్రతి ఒక్కరూ తీసుకోవాలని సూచించారు. గ్రామాభివృద్ధితో పాటు పర్యావరణ పరిరక్షణకు కూడా ప్రాధాన్యత ఇస్తున్న సర్పంచ్ సురేందర్ గౌడ్, గ్రామ ప్రజలను మొక్కలు నాటే కార్యక్రమాల్లో భాగస్వాములను చేయడం అభినందనీయమని పలువురు పేర్కొన్నారు. బీజేపీ ఎండోమెంట్ ధార్మిక సెల్ రంగారెడ్డి జిల్లా రూరల్ జాయింట్ కన్వీనర్, శంకర్‌పల్లి సేవా ఫౌండేషన్ అధ్యక్షులు నరేశ్ కుమార్ మాట్లాడుతూ, గ్రామాభివృద్ధికి సర్పంచ్ సురేందర్ గౌడ్ మానవతా దృక్పథంతో సేవలు అందిస్తున్నారని అన్నారు. మొక్కలు నాటే కార్యక్రమానికి సహకరించి స్వయంగా పాల్గొన్న సర్పంచ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. అలాగే స్వర్గీయ సుగుణ జ్ఞాపకార్థం ఆమె భర్త కందివనం నర్సింహారెడ్డి మొక్కలు సమకూర్చడంలో సహకరించి, సేవా ఫౌండేషన్ శ్రేయోభిలాషిగా పాల్గొన్నందుకు నరేశ్ కుమార్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతులు, గ్రామ పెద్దలు, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.




# ఉస్త్ర చెరువులను నింపి సాగు, తాగునీటి సమస్యలను పరిష్కరించాలి

### తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర నాయకులు గుడవర్తి నాగేశ్వరరావు డిమాండ్



**ఖమ్మం క్రైమ్ మిర్రర్ బ్యూరో:** పాలేరు ఆయకట్టు పరిధిలోని చెరువులను నింపి సాగు, తాగునీటి సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర నాయకులు గుడవర్తి నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. నేలకొండపల్లి సిపిఐ(ఎం) కార్యాలయం రావెళ్ల సత్యనారాయణ భవనంలో విలేకరులతో ఆయన మాట్లాడారు. ఎల్ నినో ప్రభావంతో సకాలంలో సరిపడా వర్షాలు రాకపోవడంతో రైతులు సాగుచేసిన వేలాది ఎకరాల పంటలు నిలువునా ఎండిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికే నేలకొండపల్లి మండలంలోని అనేక గ్రామాలలో వర్షాలు లేక భూగర్భ జలాలు అడుగంటిపోయి బోర్లు బావుల కింద సాగుచేసిన పంటలకు సైతం సాగునీరు సరిపోక నెర్రలుబారుతున్నాయన్నారు. వేల రూపాయలు పెట్టుబడులు పెట్టి సాగుచేసిన పంటలు కళ్ళముందే ఎండిపోతుండడంతో రైతులు దిక్కుతోచక తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారన్నారు. రైతులు సాగు చేసిన పంటలకు 24 గంటల విద్యుత్ సరఫరాను నిరంతరాయంగా అందించడంలో కూడా అధికారులు తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. విద్యుత్ సరఫరాలలో నెలకొన్న అంతరాయంతో పంటలకు సకాలంలో నీరందక ఎండిపోతున్నాయన్నారు. దీనికి తోడు ప్రభుత్వం ఎరువుల పంపిణీ కోసం నూతనంగా తీసుకొచ్చిన ఫెర్టిలైజర్ యాప్ విధానం రైతులను తీవ్ర ఇబ్బందులు గురి చేస్తుందన్నారు. వర్షాలు లేక అరకొరగా సాగుచేసిన పంటలకు సైతం సకాలంలో యూరియా ఇతర కాంప్లెక్స్ ఎరువులు అందకపోవడంతో రైతులు అవస్థలు పడుతున్నారన్నారు. ఈ నేపథ్యంలో పాలేరు ఆయకట్టు పరిధిలోని పాత కాలువ, నందిగామ బ్రాంచ్ కెనాల్ తో పాటు మంగాపురం మేజర్ కాలువకు కూడా నిరంతరాయంగా సాగునీరు అందించి చెరువులను నింపాలని తద్వారా సాగు, తాగునీటి సమస్యలను నివారించాలని, విద్యుత్ మోటార్లకు 24 గంటల కరెంటును నిరంతరాయంగా అందించి ఎండిపోతున్న పంటలను కాపాడాలని, యూరియా ఇతర ఎరువుల పంపిణీలో ఆన్లైన్ విధానాన్ని ఎత్తివేయాలని, పాసుబుక్కుల ఆధారంగా రైతులకు ఎరువులను నేరుగా అందించాలని డిమాండ్ చేశారు. లేనియెడల రైతులను పెద్ద ఎత్తున సమీకరించి ఆందోళనలకు పూనుకుంటామని హెచ్చరించారు. ఈ సమావేశంలో సిపిఐ(ఎం) మండల కార్యదర్శి కెవి రామిరెడ్డి, నాయకులు రచ్చ నరసింహారావు, ఇంటూరి అశోక్, పగిడికత్తుల నాగేశ్వరరావు, రావెళ్ళ అజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# గిరిజనుల అభ్యున్నతికి కేసీఆర్ పాలనలోనే పెద్దపీట

### బీఆర్ఎస్ ఎస్టీ సెల్ నాయకుడు కొర్ర కృష్ణ నాయక్



**క్రైమ్ మిర్రర్ కల్వకుర్తి (తలకొండపల్లి):** తెలంగాణ రాష్ట్రంలో కేసీఆర్ పాలనలోనే గిరిజనులకు స్వర్ణయుగం నడిచిందని బీఆర్ఎస్ ఎస్టీ సెల్ నాయకుడు కొర్ర కృష్ణ నాయక్ అన్నారు. బుధవారం తలకొండపల్లి మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో తండాలు గ్రామపంచాయతీల పరిధిలో ఉండేవని, కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ప్రతి తండాను ప్రత్యేక గ్రామపంచాయతీగా ఏర్పాటు చేసి గిరిజనులకు స్వయం పాలన కల్పించారని తెలిపారు. గిరిజన విద్యార్థుల కోసం గురుకుల పాఠశాలలు, డిగ్రీ కళాశాలలు ఏర్పాటు చేశారని పేర్కొన్నారు. గిరిజన రైతులకు రైతుబంధు, రైతుబీమా, ఉచిత విద్యుత్ వంటి పథకాలు అందించారని అన్నారు. గిరిజనులకు ఉన్న రిజర్వేషన్లను 6 శాతం నుంచి 10 శాతానికి పెంచి వారి అభ్యున్నతికి కృషి చేశారని తెలిపారు. పోడు భూములకు పట్టాలు అందించిన ఘనత కూడా కేసీఆర్‌కే దక్కుతుందని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గిరిజనులను పట్టించుకోవడం లేదని, గతంలో అమలు చేసిన సంక్షేమ పథకాలను నిర్లక్ష్యం చేస్తోందని కృష్ణ నాయక్ విమర్శించారు. గిరిజనుల కోసం కేసీఆర్ చేసిన సేవలను గిరిజన సమాజం ఎప్పటికీ మర్చిపోదన్నారు. కేసీఆర్ సేవలను గుర్తు చేసుకుంటూ గురువారం ప్రతి తండాలో ఆయన చిత్రపటానికి పాలాభిషేకం చేసి కార్యక్రమాలు నిర్వహించాలని గిరిజనులకు ఆయన పిలుపునిచ్చారు.

# కోరింతకుంట తండాలో నూతన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

### అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చర్యలు




**క్రైమ్ మిర్రర్ కల్వకుర్తి:** కోరింతకుంట తండా గ్రామపంచాయతీ పరిధిలో నూతన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో అర్హులైన లబ్ధిదారులకు నూతన స్మార్ట్ రేషన్ కార్డులను అందజేశారు..ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ మూడవత్ సరోజ రవీందర్ మాట్లాడుతూ.. ప్రభుత్వం అందిస్తున్న స్మార్ట్ రేషన్ కార్డుల ద్వారా అర్హులైన పేద, మధ్యతరగతి కుటుంబాలకు ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా నిత్యావసర సరుకులు అందడంతో పాటు ప్రభుత్వం అమలు చేసే వివిధ సంక్షేమ పథకాలకు ప్రయోజనం చేకూరుతుందని తెలిపారు. అర్హత ఉన్న ప్రతి కుటుంబానికి ప్రభుత్వ పథకాలు అందేలా అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేస్తున్నారని పేర్కొన్నారు.. గ్రామ ప్రజలకు అవసరమైన ప్రభుత్వ సేవలను గ్రామస్థాయిలోనే అందించేందుకు గ్రామపంచాయతీ పాలకవర్గం కృషి చేస్తుందని సర్పంచ్ తెలిపారు. స్మార్ట్ రేషన్ కార్డులు పొందిన లబ్ధిదారులు ప్రభుత్వ సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ నరసింహ, మాజీ ఉప సర్పంచ్ రవి, గ్రామ కార్యదర్శి శివప్రసాద్, వార్డు సభ్యులు బీమా, బాలు, స్వాతి, శక్రు నాయక్, వినోద్ కుమార్, శోభ, వసంత, చిన్ని, శంకర్ తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమానికి గ్రామస్థులు, లబ్ధిదారులు హాజరయ్యారు.

# టీజేఏ ఖమ్మం ప్రెస్ క్లబ్ అధ్యక్షుడిగా ఎండి రషీద్ ప్రధాన కార్యదర్శిగా ఎం.చిన్ని

**ఖమ్మం క్రైమ్ మిర్రర్ బ్యూరో :** టీజేఏ ఖమ్మం ప్రెస్ క్లబ్ అధ్యక్షుడిగా ఎండి రషీద్ ప్రధాన కార్యదర్శిగా ఎం చిన్ని ను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. బుధవారం ఖమ్మం ప్రెస్ క్లబ్ లో రసీదుకు శాలువతో సన్మానం చేసి స్వీట్లు తినిపించారు. ఈ కార్యక్రమంలో టీజేఏ జిల్లాఅధ్యక్షులు జి నాగ స్వామి కే జిల్లా గౌరవ అధ్యక్షులు మణికుమార్ టీజేఏ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ సయ్యద్ ఖాసిం జిల్లా నాయకులు వాసం రాజేంద్రప్రసాద్ నల్లమోతు శ్రీనివాసరావు పవన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



# ఓజోన్ రక్షణకు విద్యార్థుల గళం..!!

## పర్యావరణ పరిరక్షణపై విద్యార్థులకు అవగాహన

## ఓజోన్ పొర పరిరక్షణతోనే భవిష్యత్ తరాలకు సురక్షితమైన భూమి: హసీనా బాను

## పర్యావరణ పరిరక్షణలో విద్యార్థుల భాగస్వామ్యం కీలకం: రాజిరెడ్డి

**క్రైమ్ మిర్రర్, భూపాలపల్లి ప్రతినిధి:** "ఓజోన్ పొరను కాపాడుకుందాం.. భూమిని రక్షించుకుందాం.." అంటూ విద్యార్థుల నినాదాలతో మహాదేవపూర్ మండల కేంద్రం మార్మోగింది. ప్రపంచ ఓజోన్ దినోత్సవం సందర్భంగా బుధవారం జిల్లా పరిషత్ మహాదేవపూర్ ఉభయ పాఠశాలల ఆధ్వర్యంలో విద్యార్థులు భారీ అవగాహన ర్యాలీ నిర్వహించారు. చేతుల్లో పర్యావరణ పరిరక్షణ సందేశాలతో కూడిన ప్లకార్డులు పట్టుకొని విద్యార్థులు ఉత్సాహంగా ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ హసీనా బాను ర్యాలీలో పాల్గొని ఓజోన్ పొర ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించారు. కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు అనిల్ కుమార్ మాట్లాడుతూ.. ఓజోన్ పొర పలుచబడటం వల్ల పర్యావరణంపై కలిగే దుష్ప్రభావాలను వివరించారు. ఎన్‌జీసీ ఇన్‌చార్జి ఉపాధ్యాయులు ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ.. ఓజోన్ పొర సూర్యుడి నుంచి వచ్చే హానికరమైన అతినీలలోహిత (యూవీ) కిరణాలను గణనీయంగా గ్రహించి భూమిపై జీవరాశులను రక్షించే సహజ రక్షణ కవచంగా పనిచేస్తుందని తెలిపారు. ఓజోన్ పరిరక్షణపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాల్సిన అవసరం




ఉందన్నారు. బాలికల పాఠశాల హెచ్ఎం శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ.. ఓజోన్ పొర క్షీణిస్తే పంటలు, అడవులు, జలచర జీవులపై ప్రతికూల ప్రభావాలు ఏర్పడే అవకాశం ఉందన్నారు. సైన్స్ ఉపాధ్యాయులు మధు మాట్లాడుతూ.. ఫ్రిజ్‌లు, ఎయిర్ కండిషనర్లు, ఏరోసోల్ ఉత్పత్తుల్లో ఉపయోగించే క్లోరోఫ్లోరోకార్బన్లు వంటి పదార్థాలు ఓజోన్ పొరకు హాని కలిగిస్తాయని వివరించారు.

**"ఓజోన్ పొరను కాపాడుకుందాం.. భూమిని రక్షించుకుందాం!"**

"ఓజోన్ పొర రక్షణ అందరి బాధ్యత!" అంటూ విద్యార్థులు నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ప్రభాకర్ రెడ్డి విద్యార్థులతో పర్యావరణ ప్రతిజ్ఞ చేయించి కార్యక్రమాన్ని ముగించారు. భూమికి సహజ రక్షణ కవచమైన ఓజోన్ పొరను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందని సీనియర్ ఉపాధ్యాయులు రాజిరెడ్డి అన్నారు. విద్యార్థుల్లోనే కాకుండా సమాజంలోనూ పర్యావరణ పరిరక్షణపై అవగాహన, భాగస్వామ్యాన్ని పెంచేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతగానో ఉపయోగపడతాయని తెలిపారు. కార్యక్రమంలో ఉభయ పాఠశాలల ఉపాధ్యాయులు, ఉపాధ్యాయినులు, విద్యార్థులు పాల్గొన్నారు.




## ఆశ్రమ పాఠశాల విద్యార్థులకు ఉచిత కళ్లద్దాల పంపిణీ

**క్రైమ్ మిర్రర్ కల్వకుర్తి:** విద్యార్థుల కంటి ఆరోగ్యాన్ని పరిరక్షించడంతో పాటు దృష్టి లోపాలను గుర్తించి తగిన చికిత్స అందించేందుకు నిర్వహిస్తున్న కార్యక్రమంలో భాగంగా కల్వకుర్తి ఆశ్రమ పాఠశాలలో బుధవారం ఉచిత కళ్లద్దాల పంపిణీ చేపట్టారు. ఆర్‌బీఎస్‌కే టీమ్--బి, కంటి వైద్య సహాయకులు బావండ్ల వెంకటేష్ ఆధ్వర్యంలో గత విద్యా సంవత్సరంలో నిర్వహించిన కంటి పరీక్షల్లో దృష్టి లోపాలు ఉన్న 23 మంది విద్యార్థులను గుర్తించారు. వారికి అవసరమైన కళ్లద్దాలను డిప్యూటీ డీఎంహెచ్ఓ డా. భీమా నాయక్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డా. భీమా నాయక్ మాట్లాడుతూ చిన్న వయసులోనే దృష్టి లోపాలను గుర్తించి కళ్లద్దాలు ఉపయోగించడం ద్వారా విద్యార్థులు చదువుపై ఏకాగ్రత సాధించడంతో పాటు విద్యాభ్యాసంలో మెరుగైన ఫలితాలు సాధించవచ్చన్నారు. కంటి సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో సీహెచ్ఓ శ్రీనివాస్, కంటి వైద్య సహాయకులు బావండ్ల వెంకటేష్, ప్రధానోపాధ్యాయులు చంద్రశేఖర్, ఆర్‌బీఎస్‌కే మెడికల్ ఆఫీసర్ డా. సుఫియాన్ బేగ్, ఫార్మసిస్ట్ ఫర్హీన్ ఫాతిమా, ఏఎన్ఎం టి. ఝాన్సీ రాణి, ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## మృతుని కుటుంబానికి బీఆర్ఎస్ మాజీ మండల అధ్యక్షుడి ఆర్థిక చేయూత

### బాధిత కుటుంబాన్ని పరామర్శించి రూ.5 వేల ఆర్థిక సహాయం అందజేత



**క్రైమ్ మిర్రర్ కల్వకుర్తి(వెల్దండ):** వెల్దండ మండల కేంద్రానికి చెందిన మాడుగుల సత్తయ్య అనారోగ్యంతో మృతి చెందిన విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ పార్టీ మాజీ మండల అధ్యక్షులు కానుగుల జోగయ్య ఆయన మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. కుటుంబ సభ్యులు అధైర్యపడవద్దని, ధైర్యంగా ఉండాలని భరోసా కల్పించారు. మృతుని కుటుంబానికి తనవంతు సహాయంగా రూ.5 వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీలు లింగం, జ్యోతి నిరంజన్, ఉపసర్పంచ్ జంగిలి నిరంజన్, మాజీ సర్పంచ్ గుద్దేటి ప్రభాకర్, వార్డు సభ్యులు శేఖర్, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు అంజయ్య, మంగళగిరి సత్యం, మట్ట శ్రీనివాస్ గౌడ్, జంగిలి రవికుమార్, యువ నాయకులు జంగిలి తిరుపతయ్య, టైలర్ వెంకటయ్య, గోరేటి రాజు, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## మృతుని కుటుంబానికి సర్పంచ్ మట్ట యాదమ్మ వెంకటయ్య గౌడ్ ఆర్థిక భరోసా

**క్రైమ్ మిర్రర్ కల్వకుర్తి:** అనారోగ్యంతో మృతి చెందిన వెల్దండ మండల కేంద్రానికి చెందిన మాడుగుల సత్తయ్య కుటుంబాన్ని సర్పంచ్ మట్ట యాదమ్మ, మట్ట వెంకటయ్య గౌడ్ పరామర్శించారు. మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన అనంతరం కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఈ సందర్భంగా అధైర్యపడవద్దని, కుటుంబానికి అండగా ఉంటామని భరోసా కల్పించారు. అనంతరం మృతుని కుటుంబానికి రూ.5 వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఆపద సమయంలో బాధిత కుటుంబానికి తమ వంతు సహాయం అందించడం అభినందనీయమని స్థానికులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ ఎర్ర శ్రీను, వార్డు సభ్యులు గుద్దేటి కిష్టాల్, పాలాది మల్లీశ్వరి, రంగనాథం, మారెపల్లి శ్రీను, మంజుల, కాంగ్రెస్ పార్టీ సేవాదళ్ జిల్లా ఉపాధ్యక్షులు కొయ్యల పుల్లయ్య, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు తిరుపతిరెడ్డి, దర్గయ్య, కాంగ్రెస్ పార్టీ యువజన అధ్యక్షులు మట్ట భరత్ గౌడ్, మట్ట మల్లేష్ గౌడ్, ఈదులపల్లి రాజు తదితరులు పాల్గొన్నారు.



## రాహుల్ గాంధీని ప్రధానిని చేయడమే మా లక్ష్యం

### రాహుల్ నాయకత్వంలో దేశానికి నూతన దిశ: నీలం మధు

### 1,500 కి.మీ. పాదయాత్ర పూర్తి చేసిన కాటూరి వెంకటేశ్వర్లుకు పటాన్‌చెరులో ఘన స్వాగతం





**పటాన్‌చెరు, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి సెప్టెంబర్ 16:** కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీని ప్రధానిని చేయడమే తమ లక్ష్యమని మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి నీలం మధు ముదిరాజ్ అన్నారు. దేశ ఐక్యత, సామాజిక న్యాయం, సమ్మిళిత అభివృద్ధి లక్ష్యంగా కన్యాకుమారి నుంచి కాశ్మీర్ వరకు పాదయాత్ర చేపట్టడం అభినందనీయమన్నారు. ప్రకాశం జిల్లాకు చెందిన న్యాయవాది, సామాజిక కార్యకర్త కాటూరి వెంకటేశ్వర్లు చేపట్టిన పాదయాత్ర బుధవారం పటాన్‌చెరు నియోజకవర్గానికి చేరుకుంది. ముత్తంగి పుట్టి రింగ్ రోడ్డు వద్ద నీలం మధు ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు యాత్రకు ఘన స్వాగతం పలికారు. అనంతరం ముత్తంగి డివిజన్ పరిధిలోని పిఎస్ఆర్ గార్డెన్స్‌లో నిర్వహించిన కార్యక్రమం లో కాటూరి వెంకటేశ్వర్లును శాలువాతో సత్కరించి అభినందించారు. కాటూరి వెంకటేశ్వర్లు జూన్ 19న కన్యాకుమారి నుంచి పాదయాత్రను ప్రారంభించారని, తమిళనాడు, కేరళ, కర్ణాటక మీదుగా ఇప్పటివరకు 1,500 కిలోమీటర్లకు పైగా కాలినడకన ప్రయాణించి తెలంగాణలోని పటాన్‌చెరుకు చేరుకున్నారని తెలిపారు. మార్గమధ్యంలో వివిధ ప్రాంతాల ప్రజలను కలుసుకుంటూ వారి సమస్యలు, అభిప్రాయాలు, ఆకాంక్షలను తెలుసుకుంటూ యాత్ర కొనసాగిస్తున్నారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా నీలం మధు మాట్లాడుతూ.. దేశ భవిష్యత్తు, ప్రజల ఆకాంక్షలకు అనుగుణమైన నాయకత్వం అవసరమన్నారు. ప్రజల మధ్యకు వెళ్లి వారి సమస్యలను తెలుసుకోవడం, అన్ని వర్గాలను కలుపుకొని ముందుకు సాగడం ప్రజాస్వామ్యంలో కీలకమని పేర్కొన్నారు. యువతకు ఉపాధి అవకాశాలు, రైతులకు భరోసా, మహిళలకు సమాన అవకాశాలు, పేదలకు సామాజిక భద్రత, ప్రతి ఒక్కరికీ సమాన హక్కులపై ప్రజల్లో అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. కన్యాకుమారి నుంచి కాశ్మీర్ వరకు వేల కిలోమీటర్లు కాలినడకన ప్రయాణించడం సాధారణ విషయం కాదని నీలం మధు అన్నారు. ఎండ, వర్షం, అనేక ఇబ్బందులను ఎదుర్కొంటూ ప్రజల సమస్యలను తెలుసుకోవాలనే సంకల్పంతో పాదయాత్ర కొనసాగిస్తున్న కాటూరి వెంకటేశ్వర్లును అభినందించారు. అనంతరం నీలం మధు ముదిరాజ్ పాదయాత్రలో పాల్గొని ముత్తంగిలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. దేశంలోని అన్ని ప్రాంతాలు, అన్ని వర్గాల ప్రజలు ఐక్యంగా ముందుకు సాగినప్పుడే సమగ్ర అభివృద్ధి సాధ్యమవుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఐఎన్టియుసి అధ్యక్షుడు కొల్కురి నర్సింహారెడ్డి, కౌన్సిలర్లు గోపాల్‌రెడ్డి, దస్తగిరి, మన్నే రాఘవేంద్ర, సంపత్‌రెడ్డి, నారాయణదాసు, మణికంఠ, సందీప్‌గౌడ్, మాజీ సర్పంచులు రాజిరెడ్డి, సుంకరి రవీందర్, జగన్, సీనియర్ నాయకులు ముత్తంగి అశోక్, మధు పంతులు, గడ్డ యాదయ్య, షాపురం నర్సింహారెడ్డి, రుద్రారం లక్ష్మారెడ్డి, దండోరా నర్సింహ, గోపాలకృష్ణ, లక్దారం లక్ష్మారెడ్డి, సంజీవ, సందీప్‌యాదవ్, మైలారం శ్రీను, పాండు, శంకర్, ప్రకాష్ రాథోడ్, ప్రవీణ్, రంజిత్, రాజ్‌గోపాల్‌తో పాటు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున పాల్గొన్నారు.



## కోడంగల్ నియోజకవర్గంలోని దోబీ పోస్టులు రజకులకే కేటాయించాలి

### కోడంగల్ మున్సిపల్ చైర్మన్‌కు టిఆర్ఆర్ఎస్ జిల్లా ఉపాధ్యక్షులు గడ్డమీది వెంకటప్ప దౌల్తాబాద్ వినతి

**క్రైమ్ మిర్రర్,కోడంగల్:-** కోడంగల్ పట్టణంలో నూతనంగా నిర్మిస్తున్న 300 నుంచి 320 పడకల ఆసుపత్రితో పాటు వివిధ విద్యాసంస్థల హాస్టళ్లు, శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో దోబీ పోస్టులను అర్హులైన రజక అభ్యర్థులతో భర్తీ చేయాలని తెలంగాణ రజక రిజర్వేషన్ సమితి జిల్లా ఉపాధ్యక్షులు గడ్డమీది వెంకటప్ప దౌల్తాబాద్ కోరారు. ఈ మేరకు బుధవారం కోడంగల్ మున్సిపల్ చైర్మన్ గౌరవనీయులు ప్రశాంత్ ని మున్సిపల్ కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేసిన తెలంగాణ రజక రిజర్వేషన్ సమితి వికారాబాద్ జిల్లా ఉపాధ్యక్షులు గడ్డమీద వెంకటప్ప దౌల్తాబాద్, అన్నారం జనార్ధన్. నూతనంగా నిర్మిస్తున్న ఆసుపత్రి, గురుకుల పాఠశాల హాస్టల్, ఫార్మసీ కళాశాల హాస్టల్, పాలిటెక్నిక్ కళాశాల హాస్టల్, బీటెక్ కళాశాల హాస్టల్‌తో పాటు శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో దోబీ పోస్టులను అర్హత కలిగిన రజక అభ్యర్థులతోనే భర్తీ చేయాలని కోరారు. అదేవిధంగా ఆయా సంస్థల్లో బట్టలు ఉతికే కాంట్రాక్టులను కూడా రజకులకే కేటాయించాలని టిఆర్ఆర్ఎస్ జిల్లా ఉపాధ్యక్షులు గడ్డమీది వెంకటప్ప దౌల్తాబాద్ చైర్మన్ కి విజ్ఞప్తి చేశారు. రజకుల జీవనోపాధికి సంబంధించిన ఈ అంశంలో న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరారు. వినతిపత్రాన్ని స్వీకరించిన మున్సిపల్ చైర్మన్ ప్రశాంత్ సానుకూలంగా స్పందిస్తూ, ఈ విషయాన్ని పరిశీలించి త్వరలో మంచి నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చారు.

# సమానత్వ సాధికారత కోసం మరో పోరాటం:

### విమోచనం పేరిట చరిత్రను వక్రీకరించడం సరికాదు: చుక్క రాములు

### సాయుధ పోరాట స్ఫూర్తితో ప్రజా వ్యతిరేక విధానాలపై ఉద్యమాలు

సంగారెడ్డి, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి సెప్టెంబర్ 16: తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట స్ఫూర్తితో సమానత్వం, సాధికారత కోసం మరోసారి బలమైన పోరాటాలు చేయాల్సిన అవసరం ఉందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు చుక్క రాములు అన్నారు. తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాల్లో భాగంగా బుధవారం సిపిఎం ఆధ్వర్యంలో సంగారెడ్డిలో బైక్ ర్యాలీ నిర్వహించారు. దొడ్డి కొమురయ్య విగ్రహం నుంచి న్యూబస్టాండ్ వరకు సాగిన ర్యాలీలో చుక్క రాములు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిజాం రజాకార్ల అకృత్యాలకు, దొరలు, జాగీర్దారులు, పటేల్--పట్వారీల దోపిడీకి వ్యతిరేకంగా కమ్యూనిస్టుల ఆధ్వర్యంలో సాగిన పోరాటం చరిత్రలో కీలకమైందన్నారు. ఆ పోరాటం ద్వారా సుమారు 10 లక్షల ఎకరాల భూమిని పేదలకు పంచిన చరిత్ర కమ్యూనిస్టులదేనని పేర్కొన్నారు. తెలంగాణ సాయుధ పోరాటాన్ని హిందూ--ముస్లిం మతాల మధ్య ఘర్షణగా చిత్రీకరించడం సరికాదన్నారు. తెలంగాణ సాయుధ పోరాటానికి ఆర్ఎస్ఎస్, బీజేపీకి సంబంధం లేదని చుక్క రాములు అన్నారు. మతం పేరుతో ప్రజలను విభజించే ప్రయత్నాల పట్ల




అప్రమత్తంగా ఉండాలని పిలుపునిచ్చారు. ప్రజా సమస్యలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలకు వ్యతిరేకంగా సిపిఎం ఆధ్వర్యంలో మరిన్ని ఉద్యమాలు చేపడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజు, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మల్లేశం, మాణిక్, నర్సింలు, జిల్లా కమిటీ సభ్యులు యాదగిరి, ప్రవీణ్‌కుమార్, నాగేశ్వర్‌రావు, కృష్ణ, నాయకులు అశోక్, రాజయ్య, శ్రీధర్, శివకుమార్, మహేష్, బాబురావు తదితరులు పాల్గొన్నారు.

# కడ్తాల్‌లో వేలాది మందికి కంటి వెలుగు

## సుంకిరెడ్డి మెగా కంటి వైద్య శిబిరానికి అపూర్వ స్పందన.. ఆరు రోజుల్లో 5,740 మందికి పైగా సేవలు





**క్రైమ్ మిర్రర్ కల్వకుర్తి (కడ్తాల్):** కడ్తాల్‌లోని ఎంబీఏ గార్డెన్స్‌లో ఐక్యత ఫౌండేషన్ చైర్మన్, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు, టాస్క్ సీఓఓ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి సహకారంతో శంకర నేత్రాలయ, చెన్నై వైద్య నిపుణుల ఆధ్వర్యంలో నిర్వహించిన సుంకిరెడ్డి ఆరో మెగా ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఆరు రోజులుగా కొనసాగిన ఉచిత కంటి పరీక్షల ప్రక్రియ బుధవారంతో ముగిసింది. అయితే కంటి శుక్లాల శస్త్రచికిత్సలు ఈ నెల 19వ తేదీ వరకు కొనసాగనున్నాయి..కడ్తాల్ మండలంతో పాటు పరిసర గ్రామాల నుంచి ప్రజలు భారీగా తరలిరావడంతో శిబిరం చివరి రోజు జనంతో కిక్కిరిసిపోయింది. ఒక్కరోజే 1,500 మందికి పైగా శిబిరాన్ని సందర్శించి కంటి వైద్య సేవలను వినియోగించుకున్నారు. చివరి రోజు 940 మందికి పైగా ఉచిత కంటి పరీక్షలు నిర్వహించగా, 680 మందికి పైగా ఉచితంగా కంటి అద్దాలు పంపిణీ చేశారు. మరో 25 మందిని కంటి శుక్లాల శస్త్రచికిత్సలకు ఎంపిక చేశారు.

**ఆరు రోజుల్లో వేలాది మందికి సేవలు...**

ఆరు రోజుల వ్యవధిలో 5,740 మందికి పైగా శిబిరాన్ని సందర్శించగా, 3,702 మందికి పైగా ఉచిత కంటి పరీక్షలు నిర్వహించారు. 2,350 మందికి పైగా ఉచిత కంటి అద్దాలు పంపిణీ చేశారు. కంటి శుక్లాల సమస్యతో బాధపడుతున్న 154 మందిని శస్త్రచికిత్సలకు ఎంపిక చేశారు. ఇప్పటికే రెండు రోజులుగా 61 మందికి విజయవంతంగా కంటి శుక్లాల ఆపరేషన్లు పూర్తయ్యాయి. ఈ సందర్భంగా సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని పేద, మధ్యతరగతి ప్రజలకు కంటి వైద్యం అందుబాటులోకి తీసుకురావాలనే ఉద్దేశంతో ఈ శిబిరాన్ని నిర్వహించినట్లు తెలిపారు. కంటి వైద్య సేవల కోసం ప్రజలు దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా తమ ప్రాంతంలోనే ఉచిత సేవలు అందించామన్నారు. ప్రజల నుంచి లభించిన స్పందన ఎంతో సంతోషాన్ని కలిగించిందని, భవిష్యత్తులోనూ ప్రజలకు అవసరమైన సేవా కార్యక్రమాలను కొనసాగిస్తామని పేర్కొన్నారు.

**పేదలకు ఎంతో ఉపయోగకరమైన సేవ...**

మాజీ జడ్పీటీసీ దశరథ్ నాయక్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత ప్రజలకు ఉచిత కంటి వైద్య సేవలను అందుబాటులోకి తీసుకురావడం అభినందనీయమన్నారు. ఆరు రోజుల పాటు పెద్దఎత్తున శిబిరాన్ని నిర్వహించి వేలాది మందికి కంటి పరీక్షలు చేయించడం, అవసరమైన వారికి ఉచితంగా కంటి అద్దాలు అందించడం, కంటి శుక్లాల బాధితులకు ఉచితంగా ఆపరేషన్లు నిర్వహించడం గొప్ప సేవా కార్యక్రమమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ కడ్తాల్ మండల అధ్యక్షులు పోతుగంటి శంకర్, వైస్ ఎంపీపీ ఆనంద్, సర్పంచులు సేవ్య నాయక్, ప్రియ రమేష్, శ్రీను నాయక్, మాజీ ఎంపీపీ పంతు నాయక్, మాజీ సర్పంచులు హరిచంద్, భూనాద్, ఉపసర్పంచ్ పండు నాయక్, వార్డు సభ్యులు నాగార్జున, దేవుల, సీనియర్ నాయకులు గోపాల్, శక్రూ, శ్రీను, జగన్, బీక్యా నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# సాయుధ పోరాట యోధుల సేవలు వెలకట్టలేనివి

### భూమి కోసం.. భుక్తి కోసం.. వెట్టి చాకిరి విముక్తి కోసం సాగిన పోరాటం స్ఫూర్తిదాయకం

### యోధుల త్యాగాలను భావితరాలకు తెలియజేయాలి: జిల్లా కార్యవర్గ సభ్యులు కే. హరిచంద్ర



**క్రైమ్ మిర్రర్,గుండాల:-** తెలంగాణ సాయుధ పోరాటంలో పాల్గొన్న యోధుల త్యాగాలు, సేవలు వెలకట్టలేనివని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కే. హరిచంద్ర అన్నారు. తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాల్లో భాగంగా గుండాల మండలంలోని పలు గ్రామాల్లో యోధుల స్తూపాల వద్ద నివాళులర్పించి, వారి పోరాట చరిత్రను ప్రజలకు వివరించారు.

సుద్దాల గ్రామంలో సుద్దాల హనుమంతు, పడకంటి రామస్వామి, అనంతారం గ్రామంలో కంబాల వీరస్వామి, మరిపడిగ గ్రామంలో చాంద్ పాషా, పాల్వాయి రామ్‌రెడ్డి, సింగారం రాజు, గాదె రాజు, బి. రామచంద్రు, గజ్జెల్లి మల్లయ్య, అనంతుల భాగ్య తదితర యోధుల పోరాటాలను ఈ సందర్భంగా గుర్తుచేశారు. భూస్వామ్య, నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా యోధులు సాగించిన పోరాటం ప్రజల హక్కుల సాధనకు మార్గదర్శకంగా నిలిచిందన్నారు.భూమి కోసం.. భుక్తి కోసం.. వెట్టి చాకిరి విముక్తి కోసం జరిగిన ఉద్యమంలో యోధులు కీలక పాత్ర పోషించారని తెలిపారు. తమ కలం, గళంతో ప్రజలను చైతన్యపరిచి ఉద్యమాల వైపు ఆకర్షించారని పేర్కొన్నారు. గుర్రం యాదగిరిరెడ్డి ఈ ప్రాంతంలో సుమారు ఆరు నెలలు ఉండి భూ పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారని, సుమారు 600 ఎకరాల భూమిని పంపిణీ చేయడంలో కీలక పాత్ర పోషించారని తెలిపారు.

**"యువతకు పోరాట చరిత్రను తెలియజేయాలి"**

వారోత్సవాల్లో యువత, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని సాయుధ పోరాట చరిత్రను తెలుసుకోవాలని నాయకులు పిలుపునిచ్చారు. తెలంగాణ సాయుధ పోరాట స్ఫూర్తిని భావితరాలకు అందించేలా పాఠ్యపుస్తకాల్లో చరిత్రకు తగిన ప్రాధాన్యం కల్పించాలని కోరారు.

**"ప్రభుత్వ హామీలు అమలు చేయాలి"**

సీపీఐ మండల కార్యదర్శి అనంతుల రామచంద్రయ్య మాట్లాడుతూ ఎన్నికల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. గుండాల మండలానికి 24 గంటల నాణ్యమైన విద్యుత్తు, సాగు, తాగునీటి సౌకర్యాలు కల్పించాలని కోరారు. మండలంలోని అన్ని రహదారులను బీటీ రోడ్లుగా అభివృద్ధి చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ రాష్ట్ర సమితి సభ్యుడు బి. శ్రీను, మండల కార్యవర్గ సభ్యులు కొమురయ్య, ఎస్. స్వామి, పుల్లయ్య, బిక్షం, పృథ్వీ, చంద్రయ్య, జి. వెంకటయ్య, బి. యాదయ్య, బక్కయ్య, శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

# ఆపదలో కార్యకర్త కుటుంబానికి కాంగ్రెస్ అండ

### వెల్జాల్‌లో మృతుడి కుటుంబాన్ని పరామర్శించి రూ.25,500 ఆర్థిక సాయం

**క్రైమ్ మిర్రర్ కల్వకుర్తి (తలకొండపల్లి):** తలకొండపల్లి మండలం వెల్జాల్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ యువ కార్యకర్త కూరాకుల (ఎరుకలి) ఆంజనేయులు (అంజి) తమ్ముడు కూరాకుల రాఘవేందర్ ఇటీవల వినాయక మండపం పనులు చేస్తూ ప్రమాదవశాత్తు మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మండల, గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు బుధవారం బాధిత కుటుంబాన్ని పరామర్శించి ధైర్యం చెప్పారు.మృతుడి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించిన అనంతరం కుటుంబ సభ్యులకు రూ.25,500 ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ.. ఆపదలో ఉన్న ప్రతి కార్యకర్త కుటుంబానికి పార్టీ అండగా నిలుస్తుందని, బాధిత కుటుంబాలకు తమవంతు సహాయ సహకారాలు అందిస్తామని భరోసా ఇచ్చారు.ఆర్థిక సహాయం అందించిన వారిలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కాసు శ్రీనివాస్ రెడ్డి రూ.4వేలు, మాజీ మండల అధ్యక్షుడు దోకూరి ప్రభాకర్ రెడ్డి రూ.4వేలు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ చర్ల వెంకట్ రెడ్డి రూ.2 వేలు, మాజీ ఎంపీటీసీలు జి. శ్రీనివాసమూర్తి రూ.వెయ్యి, ఎం. అంబాజీ రూ.2వేలు, మాజీ ఉపసర్పంచ్ అజీజ్ రూ.3వేలు తో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలు ఉన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ ఎం. అంబాజీ, మాజీ ఉపసర్పంచ్ అజీజ్, మండల కాంగ్రెస్ మైనార్టీ సెల్ అధ్యక్షుడు ఎండి. ఆరిఫ్, మాజీ సింగిల్ విండో డైరెక్టర్ టి. కృష్ణయ్య గౌడ్, నాయకులు ఎండి. యూసుఫ్, వద్దే రాజు, పుల్జాల విష్ణు, దుబ్బ నరేష్, సయీద్, వద్దే రామ్, చీపురి దర్శన్, గోపాల్, వట్టల మల్లేష్, మిడత రమేష్, చింతకాయల శివ తదితరులు పాల్గొన్నారు.



# ఇచ్చిన మాటకు కట్టుబడి.. 24 గంటల్లోనే రంగంలోకి!

### మార్కెట్ స్థలంలో పనులు వేగవంతం

### జేసీబీలతో స్థలం శుభ్రం.. మార్కెట్‌కు అనువుగా చదును చేసే పనులు ప్రారంభం

### మాజీ మున్సిపల్ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి





**అమీన్‌పూర్, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి సెప్టెంబర్ 16:** ఇచ్చిన మాటకు కట్టుబడి 24 గంటలు గడవకముందే మాజీ మున్సిపల్ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి రంగంలోకి దిగారు. అమీన్‌పూర్ సర్కిల్ పరిధిలో గురువారం, ఆదివారం నిర్వహించే కూరగాయల మార్కెట్‌ను అనువైన ప్రదేశానికి తరలించే అంశంపై వ్యాపారులతో నిన్న జరిగిన సమావేశంలో ఇచ్చిన హామీ మేరకు మార్కెట్ ఏర్పాటుకు సంబంధించిన పనులను బుధవారం వేగవంతం చేశారు. సాయిరాం ఎన్‌క్లేవ్ ఫేజ్-2 సమీపంలోని ప్రభుత్వ స్థలాన్ని తుమ్మల పాండురంగారెడ్డి స్వయంగా పరిశీలించారు. అనంతరం జేసీబీలను రప్పించి స్థలంలో పేరుకుపోయిన చెత్తాచెదారం, పిచ్చిమొక్కలను యుద్ధప్రాతిపదికన తొలగించే పనులు ప్రారంభించారు. మార్కెట్ నిర్వహణకు అనువుగా స్థలాన్ని చదును చేసే పనులను దగ్గరుండి పర్యవేక్షించారు. మార్కెట్‌లో వ్యాపారులకు స్టాళ్లు ఏర్పాటు చేసుకునేందుకు అనుకూలంగా ఉండటంతో పాటు, స్థానిక ప్రజల రాకపోకలకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. మార్కెట్‌కు వచ్చే వాహనాలకు పార్కింగ్ సౌకర్యం కల్పించడం, ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా అవసరమైన ఏర్పాట్లు చేయడంపై మార్కెట్ వ్యాపార సంఘం ప్రతినిధులతో చర్చించారు. ఈ సందర్భంగా తుమ్మల పాండురంగారెడ్డి మాట్లాడుతూ.. మార్కెట్ వ్యాపారుల సమస్యలు, సాధకబాధకాలను తెలుసుకున్న అనంతరం తక్షణమే సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చామని తెలిపారు. ఇచ్చిన మాట ప్రకారం మరుసటి రోజే సాయిరాం ఎన్‌క్లేవ్ ఫేజ్-2 సమీపంలోని ప్రభుత్వ స్థలంలో జేసీబీలతో శుభ్రపరిచే పనులు ప్రారంభించామని చెప్పారు. గురువారం, ఆదివారం సంత వ్యాపారుల జీవనోపాధికి ఎలాంటి ఇబ్బంది కలగకుండా, అదే సమయంలో ప్రజలకు ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా అవసరమైన అన్ని వసతులతో మార్కెట్ స్థలాన్ని సిద్ధం చేస్తున్నామని తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారంలో ఎప్పుడూ ముందుంటామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ కృష్ణ, ఉపేందర్‌రెడ్డి, కొల్లూరు చంద్రకళ గోపాల్, మాజీ కో-ఆప్షన్ సభ్యుడు తలారి రాములు, గ్రామ పెద్దలు, మార్కెట్ వ్యాపార సంఘం ప్రతినిధులు, స్థానిక నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



# ఉద్యమకారుల ఫోరం యాదాద్రి భువనగిరి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ గా మారగొని శ్రీనివాస్ గౌడ్

**క్రైమ్ మిర్రర్, యాదాద్రి భువనగిరి జిల్లా బ్యూరో:-** ఉద్యమకారుల ఫోరం యాదాద్రి భువనగిరి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ గా మండల కేంద్రానికి చెందిన ఉద్యమకారుల ఫోరం మండల అధ్యక్షుడు మారగొని శ్రీనివాస్ గౌడ్ ను నియమించారు. బుధవారం భువనగిరి లో ఈనెల 27న యాదగిరిగుట్టలో జరిగే ఆవిర్భావ దినోత్సవ పోస్టర్ను ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ చీమ శ్రీనివాస్ చేతుల మీదుగా ఆవిష్కరించిన అనంతరం యాదాద్రి భువనగిరి జిల్లా కమిటీ అధ్యక్షునిగా కొలను శ్రీనివాస్ రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ గా మారగొని శ్రీనివాస్ గౌడ్ ను, జిల్లా సలహాదారులుగా బొడిగే సుదర్శన్,నారగోని అంజయ్య,భువనగిరి ఉద్యమకారుల ఫోరం మండల అధ్యక్షునిగా రత్నపురం శ్రీనివాస్ ల ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో ఉద్యమకారులు బట్టు రామచంద్రయ్య, ఉద్యమకారుల ఫోరం ఉమ్మడి నల్లగొండ జిల్లా అధ్యక్షుడు శీలం స్వామి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు జోగుఅంజన్న, దుగ్యాల శ్యామల, జగన్, చిలుగూరి సత్తిరెడ్డి, కదిరేణి స్వామి, తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్ర ముఖ్యమంత్రి ఇచ్చిన హామీలన్నీ మర్చిపోయాడు.

### రాష్ట్రం ఏ ఒక్క హామీ కూడా పూర్తిగా నెరవేర్చలేదు.

### తెలంగాణ ప్రజాశక్తి పార్టీ అధినేత - దొడ్ల వెంకట్




**క్రైమ్ మిర్రర్,సదాశివపేట:** సదాశివపేట పట్టణంలో తెలంగాణ ప్రజాశక్తి పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో తెలంగాణ ప్రజాశక్తి పార్టీ రాష్ట్ర అధ్యక్షులు దొడ్ల వెంకట్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎన్నికలకు ముందు ఇచ్చినటువంటి హామీలు ఇప్పటివరకు సంపూర్ణంగా నెరవేర్చిన పాపాన పోలేదు. రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి వృద్ధాప్య పింఛన్లు, వితంతు పింఛన్లు, సౌభాగ్య లక్ష్మి, అంతేకాకుండా ప్రతి రైతుకు రెండు లక్షల లోపు రుణమాఫీ చేస్తామని పూర్తిగా మాట తప్పి తెలంగాణ రాష్ట్రంలో ఏ ఒక గ్రామంలో కూడా ఏ ఒక్క రైతుకు రెండు లక్షల రూపాయలు రుణమాఫీ ఇంకా జరగలేదు ఇలాంటి అబద్ధపు మాటలు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వాన్ని ఇంకా ఎన్నో రోజులు నడిపే పరిస్థితులు పూర్తిగా పోతాయని ఆయన అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ఇచ్చిన హామీలను వెంటనే తెలంగాణ ప్రజాశక్తి పార్టీ ప్రజల పక్షాన పోరాడుతుందని ఆయన ఈ కార్యక్రమంలో తెలంగాణ ప్రజాశక్తి పార్టీ పట్టణ అధ్యక్షులు పరిగి శ్రీనివాస్, జిల్లా నాయకులు నవీన్ తదితరులు పాల్గొన్నారు.

# మల్లికార్జున ఆలయ ప్రాంగణంలో నిఘా నేత్రాలు!

### మందుబాబులు, అసాంఘిక కార్యకలాపాలపై పోలీసుల నిఘా

### ఆలయ పరిసరాల్లో 25 సీసీ కెమెరాలు..

### నాలుగు ప్రధాన మార్గాలపై ప్రత్యేక ఫోకస్



బీరంగూడ, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి సెప్టెంబర్ 16: బీరంగూడ గుట్టపై కొలువైన శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి ఆలయ పరిసరాల్లో అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేసేందుకు పోలీసులు చర్యలు చేపట్టారు. భక్తుల భద్రతకు ప్రాధాన్యతనిస్తూ ఆలయ ప్రాంగణం, పార్కింగ్ ప్రాంతాలు, నాలుగు ప్రధాన ప్రవేశ మార్గాల్లో మొత్తం 25 సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఈ మేరకు సీఐ ప్రవీణ్‌రెడ్డి, ఎస్ఐ విజయ్‌కుమార్ ఆలయాన్ని సందర్శించి పరిసర ప్రాంతాలను పరిశీలించారు. ఆలయ ఈవో దేవనాదం, చైర్మన్ సుధాకర్‌యాదవ్, సిబ్బందితో కలిసి సీసీ కెమెరాల ఏర్పాటుకు అనువైన ప్రదేశాలను గుర్తించారు. ఆలయ పరిసరాల్లోని పార్కింగ్ ప్రాంతాలను అడ్డాగా చేసుకుని మద్యం సేవించడం, ఇతర అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్న వారిపై ప్రత్యేక నిఘా పెట్టనున్నట్లు పోలీసులు తెలిపారు. సీసీ కెమెరాల ద్వారా అనుమానాస్పద కదలికలను నిరంతరం పర్యవేక్షించడంతో పాటు నిబంధనలు ఉల్లంఘించే వారిని గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. ఆలయానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రశాంతమైన, సురక్షిత వాతావరణాన్ని కల్పించడమే లక్ష్యంగా భద్రతా చర్యలు చేపడుతున్నట్లు అధికారులు తెలిపారు. 25 సీసీ కెమెరాల ఏర్పాటుతో ఆలయ ప్రాంగణం, పార్కింగ్ ప్రాంతాలు, ప్రవేశ మార్గాలపై పోలీసుల నిఘా మరింత పటిష్టం కానుంది.

# బస్వాపురం ప్రాజెక్టులో భూములు కోల్పోయిన రైతులకు తక్షణమే నష్టపరిహారం చెల్లించాలి

భూములు కోల్పోయిన రైతులు అంటే పాలకులకు ఇంత చులకనా?
వారం రోజులలో బస్వాపురం నిర్వాసితులకు నష్టపరిహారం ప్రకటించకపోతే ప్రాజెక్ట్ పనులు అడ్డుకుంటా
సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు యండి జహంగీర్




క్రైమ్ మిర్రర్, యాదాద్రి భువనగిరి జిల్లా బ్యూరో:- బస్వాపురం ప్రాజెక్టు నిర్మాణంలో భూములు కోల్పోయిన 97 మంది రైతులకు ప్రభుత్వం తక్షణం నష్టపరిహారం చెల్లించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు యండి జహంగీర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసినారు. భూములు కోల్పోయిన రైతులను పాలకులు నిర్లక్ష్య వైఖరికి చులకనగా చూస్తున్నారని వారం రోజులలో నిర్వాసితులకు నష్టపరిహారం ప్రకటించకపోతే ప్రాజెక్టు పనులను అడ్డుకుంటామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. బుధవారం సీపీఎం భువనగరి మండల కమిటీ ఆధ్వర్యంలో బస్వాపురం ప్రాజెక్టులో సర్వే నెంబరు 229 లోని 110 ఎకరాల 24 గంటల భూమిని కోల్పోయిన 97 మంది రైతులకు నష్టపరిహారం చెల్లించాలని కోరుతూ బస్వాపురం గ్రామం నుండి ముత్తిరెడ్డిగూడెం మీదుగా జిల్లా కలెక్టర్ కార్యాలయం వరకు 8 కిలోమీటర్లు రైతులతో కలిసి పాదయాత్ర నిర్వహించిన అనంతరం జిల్లా కలెక్టరేట్ ముందు ధర్నా నిర్వహించి జిల్లా ఇంచార్జు కలెక్టర్‌కు మెమొరండం సమర్పించిన అనంతరం నిర్వాసితుల రైతులను ఉద్దేశించి జహంగీర్ మాట్లాడుతూ సందర్భంగ మాట్లాడుతూ బస్వాపురం గ్రామంలోని 97 మంది రైతులు 60, 70 సంవత్సరాలుగా ప్రభుత్వ భూమిని నమ్ముకోని ఆ భూములను సాగు చేసుకుంటూ జీవిస్తున్నా పేద రైతులు ప్రాజెక్టు నిర్మాణం వల్ల తమ జీవనాధారాన్ని పూర్తిగా కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. భూమి అనేది మనిషికి ఆర్థికంగా సామాజికంగా ఎంతో విలువైనదిగా ఉపయోగపడుతుందని తెలిపారు. భూమి ఆర్థిక భద్రతతో పాటు సామాజిక భద్రతను కూడా కల్పిస్తుందని అన్నారు. సమాజంలో భూమి ఉన్నవారికి ప్రత్యేకమైన గౌరవం గుర్తింపు కూడా ఉంటాయని తెలిపారు. జీవనాధారమైన భూమినే ప్రాజెక్టులో కోల్పోతే పాలకులు, అధికారులు నేటికీ ఎలాంటి నష్టపరిహారం రైతులకు చెల్లించకపోవడం చాలా దారుణమని విమర్శించారు. పాలకులు మరియు అధికారుల ఈ ద్వంద్వ వైఖరిని తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. ఇప్పటికైనా తక్షణం బస్వాపురం ప్రాజెక్టులో భూములు కోల్పోయిన రైతులకు నష్టపరిహారం ఇవ్వాలని లేకపోతే రైతుల తరపున సిపిఎం ఆధ్వర్యంలో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సిపిఐ రాష్ట్ర నాయకులు గోద శ్రీరాములు మద్దతుగా పాల్గొని మాట్లాడుతూ నిర్వాసితుల విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం ద్వంద వైఖరి ఆలంబిస్తుందని విమర్శించారు. అభివృద్ధి కోసం, ప్రాజెక్టుల కోసం భూములు కోల్పోయిన రైతులను, నిర్వాసితులను ఎందుకు ప్రభుత్వం ఆదుకోదాన్ని ప్రశ్నించారు. బస్వాపురంలోని రైతులు గత ఏడు, ఎనిమిది సంవత్సరాలుగా నష్టపరిహారం కోసం అధికారుల చుట్టూ తిరుగుతున్నా పట్టించుకోవడంలేదని విమర్శించారు. ఇప్పటికైనా బస్వాపురం రైతులకు తక్షణం నష్టపరిహారం ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు కొండమడుగు నర్సింహ్మ మాట్లాడుతూ రాయగిరి రెవెన్యూ పరిధిలోని ముత్తిరెడ్డిగూడెం గ్రామానికి చెందిన సర్వే నెం. 259లో ప్రభుత్వ భూమి కలిగిన రైతులకు ప్రాజెక్టు కాలువ తీసినప్పుడు నష్టపరిహారం చెల్లించారని అదే పద్ధతిలో బస్వాపురం ప్రాజెక్టులో ప్రభుత్వ భూమిని సాగుచేసు కుంటున్న భూములను కోల్పోయిన 97 మంది పేద రైతులకు కూడా తక్షణమే నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి, సర్వం కోల్పోయి రోడ్డున పడ్డ బస్వాపురం ప్రాజెక్టు నిర్వాసిత రైతులకు న్యాయం చేయాలని, స్థానిక శాసనసభ్యులు కూడా నిర్వాసితులన సమస్య పరిష్కారం కోసం కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మాటూరి బాలరాజు, జిల్లా కమిటీ సభ్యులు దయ్యాల నరసింహ, మండల కార్యదర్శి పల్లెర్ల అంజయ్య, సిపిఐ జిల్లా నాయకులు ఏషాల అశోకు, కాంగ్రెస్ నాయకులు చిక్కుల వెంకటేష్, ప్రజాఫ్రంట్ నాయకులు బాలస్వామి, సిపిఎం నాయకులు మరియు నిర్వాసిత రైతులు ఉడత విష్ణు, అన్నంపట్ల కృష్ణ, మధ్యపురం బాల నరసింహ, నరాల చంద్రయ్య, మచ్చ వెంకట్ నరసయ్య, మచ్చ భాస్కర్, బుర్రు అనిల్, వడ్డెబోయిన వెంకటేష్, పాండాల మైసయ్య, కొండపురం యాదగిరి, చంద్రశేఖరు, రాజమణి, బాలమణి, రాధమ్మ, విజయలక్ష్మి, వెంకటేశం, లక్ష్మి, విజయ, మహేష్, బాలరాజు, వెంకటేష్, మల్లేష్, కొండలు తదితరులు పాల్గొన్నారు.



## మృతుల కుటుంబాలకు దశరత్ నాయక్ ఆర్థిక సాయం

క్రైమ్ మిర్రర్ కల్వకుర్తి (కడ్తాల్): కష్టాల్లో ఉన్న నిరుపేద కుటుంబాలకు అండగా నిలవడమే లక్ష్యంగా రాధాకృష్ణ మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో బుధవారం ముగ్గురు బాధిత కుటుంబాలకు ఆర్థిక సాయం అందించారు. కడ్తాల్ మాజీ జెడ్పీటీసీ, లంబాడి హక్కుల పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షులు, ట్రస్ట్ చైర్మన్ జర్పుల దశరథ్ నాయక్ తన ట్రస్ట్ ద్వారా ఒక్కో కుటుంబానికి రూ.5 వేల చొప్పున మొత్తం రూ.15 వేల సాయం అందజేశారు. వాసుదేవపూర్‌కు చెందిన పాత్లవత్ పులియా, మైసిగండికి చెందిన రామావత్ మారోని, కడ్తాల్‌కు చెందిన మాదారం నాగమణి కుటుంబాలకు ఈ సాయం అందించారు. అదేవిధంగా మాజీ వైస్ ఎంపీపీ ఆనంద్ మాదారం నాగమణి కుటుంబానికి అదనంగా రూ.5 వేల ఆర్థిక సాయం అందించారు. దీంతో నాగమణి కుటుంబానికి మొత్తం రూ.10 వేల సాయం లభించింది. ఈ సందర్భంగా జర్పుల దశరథ్ నాయక్ మాట్లాడుతూ పదవులు ఉన్నా లేకపోయినా ప్రజల కష్టసుఖాల్లో భాగస్వామ్యం కావడం ప్రతి ప్రజా సేవకుడి బాధ్యత అన్నారు. రాజకీయాలకు అతీతంగా నిరుపేదలకు అండగా నిలుస్తామని తెలిపారు. బాధిత కుటుంబాలు దశరథ్ నాయక్, ఆనంద్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ ప్రియా రమేష్, శీను నాయక్, మాజీ ఎంపీటీసీలు లచ్చిరామ్ నాయక్, సక్రి, మాజీ సర్పంచ్ తులసిరామ్ నాయక్, హరిచంద్ నాయక్, నరేందర్ నాయక్, గోపాల్, పత్తి వినోద్, భాను, వెంకటేష్, కృష్ణయ్య, శీను, సుభాష్, ప్రేమ్, గౌతమ్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

## వివాహానికి ఆర్థిక సాయం అందజేత



చిట్యాల క్రైమ్ మిర్రర్: చిట్యాల మండలం పెద్దకాపర్తి గ్రామానికి చెందిన శిరస్సు ముత్యాలు, గుండెపురి బిక్షం, శిరస్సు ఇద్దయ్య కుమార్తెల వివాహానికి ఆర్థిక సాయంగా ఒక్కొక్కరికి పది వేల రూపాయల చొప్పున మొత్తం ముప్పై వేల రూపాయలను సర్పంచ్ కాటం వెంకటేశం, ఉప సర్పంచ్ ఓర్సు సైదులు అందజేశారు. గ్రామ సర్పంచ్ గా కాటం వెంకటేశం గెలిస్తే ప్రతి ఆడబిడ్డ పెళ్లికి పది వేలు ఇస్తానని ఓర్సు రాజకుమార్ ఇచ్చిన మాట ప్రకారం ఈ సాయాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో ఏర్పుల నరసింహ, వార్డు సభ్యులు కురు యాదయ్య, సాగర్ల నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## గణేష్ మండపాల వద్ద అప్రమత్తత తప్పనిసరి

### నిమజ్జనంలో డీజేలకు అనుమతి లేదు.. నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు

క్రైమ్ మిర్రర్ కల్వకుర్తి (మాడ్గుల): గణేష్ నవరాత్రి ఉత్సవాలు, నిమజ్జన కార్యక్రమాల నేపథ్యంలో ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణకు మండపాల నిర్వాహకులు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని ఇబ్రహీంపట్నం ఏసీపీ కె.పి.వి. రాజు సూచించారు. బుధవారం మాడ్గుల మండల పరిధిలోని పలు గణేష్ మండపాలను ఏసీపీతో పాటు మాడ్గుల పోలీస్‌స్టేషన్ ఎస్‌హెచ్‌ఓ టి. వేణుగోపాల్, అడ్మిన్ ఎస్ఐ హెచ్. రాఘవేందర్ సందర్శించి నిర్వాహకులకు భద్రతా సూచనలు చేశారు. మండపాల వద్ద విద్యుత్ కనెక్షన్లు, వైరింగ్ విషయంలో అప్రమత్తంగా ఉండాలని, జనసందోహాన్ని నియంత్రించడంతో పాటు అగ్నిప్రమాదాల నివారణకు ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. నిమజ్జన ఊరేగింపుల సమయంలో డీజే సౌండ్ సిస్టమ్‌కు అనుమతి లేదని స్పష్టం చేశారు. ఇతరులను రెచ్చగొట్టే, కించపరిచే విధంగా నినాదాలు, స్లొంగ్‌లు చేయకుండా సంయమనం పాటించాలని నిర్వాహకులకు సూచించారు. ఉత్సవాలను శాంతియుతంగా, స్నేహపూర్వక వాతావరణంలో నిర్వహిస్తూ పోలీసులకు సహకరించాలని కోరారు. నిబంధనలు ఉల్లంఘించి శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు.



## ఎల్‌పీజీ సిబ్బందిని ఘనంగా సత్కరించిన జిఎం ఎన్.రాధాకృష్ణ

మందమర్రి టౌన్ సెప్టెంబర్ 16 క్రైమ్ మిర్రర్: సింగరేణి సూపర్ బజార్ ద్వారా ఇండియన్ ఆయిల్ ఎల్‌పీజీ సేవలను అత్యంత పారదర్శకంగా, సమర్థవంతంగా అందిస్తున్న పాలకుర్తి రాజు వారి సిబ్బందికి జనరల్ మేనేజర్ కార్యాలయంలో జిఎం ఎన్ రాధాకృష్ణ బుధవారం శుభాకాంక్షలు తెలిపి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇండియన్ ఆయిల్ ఎల్ పీ జీ కార్పొరేట్ హెడ్ ఆఫీస్ హైదరాబాద్ వారు ప్రత్యేకంగా డివిజనల్ మేనేజర్ పాలకుర్తి రాజుని సత్కరించి అభినందించారని తెలిపారు. ముఖ్యంగా రామకృష్ణాపూర్, బెల్లంపల్లి, మందమర్రి, శ్రీరాంపూర్ ప్రాంతాలలో నాణ్యమైన ఎల్‌పీజీ గ్యాస్ సేవలు అందిస్తూ వినియోగదారుల నమ్మకాన్ని గెలుచుకున్న సిబ్బంది కృషిని ఆయన కొనియాడారు. భవిష్యత్తులో కూడా ఇదే రీతిలో మెరుగైన సేవలు అందించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో డీజీఎం పర్సనల్ సి. హెచ్. అశోక్, సూపర్ బజార్ బ్రాంచ్ మేనేజర్ సుదర్శన్, సూపర్ బజార్ కో-ఆర్డినేటర్ భూపతి శ్రీనివాసరాజు తదితరులు పాల్గొన్నారు.





## రామప్ప దేవాలయంను సందర్శించిన ప్రపంచ బ్యాంకు ప్రతి నిధులు

వెంకటాపూర్ (రామప్ప), క్రైమ్ మిర్రర్, సెప్టెంబర్ 16:మండలం లోని పాలంపేట గ్రామంలోని రామప్ప దేవాలయాన్ని బుధవారం ప్రపంచ బ్యాంకు ప్రతినిధులు పూనమ్ ఆలువాలియా, ఆపూర్వ శేన్వీ, వెంకట రావు, నిత్య, నేహ ప్రవాష్ దర్శించుకున్నారు,, ఆలయ అర్చకులు హరీష్ శర్మ, ఉమాశంకర్ వారికి ప్రత్యేక పూజలు చేసి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆలయ కార్యనిర్వహణ అధికారి ఇమ్మడి భాస్కర్ స్వామి శేష వస్త్రాలను బహూకరించారు. వారికి హనుమకొండ హార్టీ కల్చర్ మరియు పర్యాటక శాఖ అధికారి ఎం శివాజీ రామప్ప కు ప్రపంచ వారసత్వ కట్టడంగా గుర్తింపు లబించిన తర్వాత జరిగిన అభివృద్ధి, ప్రసాద్, సాస్కీ స్కీం లలో జరుగుతున్న అభివృద్ధి పనుల గురించి వివరించారు. టూరిజం గైడ్ గోరంట్ల విజయ్ కుమార్ లు ఆలయ చరిత్ర, శిల్పకళ వైభవం, కాకతీయుల చరిత్ర గురించి వివరించారు. మరియు మేడారం శ్రీ సమ్మక్క , సారలమ్మ ను దర్శించుకుని, లక్నవరం సరస్సు ను కూడా సందర్శించారు, వారి వెంట గ్రూప్ వన్ అధికారిణి రవళి, డీటీ భవానీ ప్రసాద్,, టూరిస్ట్ పోలీసులు శ్రీనివాస్ , శ్రీకాంత్, దశరథ్, శ్రీను, రెవెన్యూ, పురావస్తు, దేవాదాయ, టూరిజం శాఖల సిబ్బంది తదితరులు ఉన్నారు.

## బాంబే కాలనీలో మోడల్ రైతు బజార్ ప్రారంభం

### ఆదివారం నుంచి పూర్తిస్థాయిలో కూరగాయలు, పండ్లు, నాన్‌వెజ్ విక్రయాలు

### పెండింగ్ పనులు త్వరగా పూర్తి చేయాలి: ఆదర్శ్‌రెడ్డి, సింధు ఆదర్శ్‌రెడ్డి





పటాన్‌చెరు, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి సెప్టెంబర్ 16: భారతీనగర్ డివిజన్ బాంబే కాలనీలో నూతనంగా ఏర్పాటు చేసిన మోడల్ రైతు బజార్ షాపుల ప్రారంభ కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పటాన్‌చెరు నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జి ఆదర్శ్‌రెడ్డి, భారతీనగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ వి.సింధు ఆదర్శ్‌రెడ్డి, అమీన్‌పూర్ డిప్యూటీ కమిషనర్ ప్రదీప్‌కుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా షాపుల కేటాయింపుదారులతో ఆదర్శ్‌రెడ్డి మాట్లాడారు. కొన్ని మౌలిక సదుపాయాల పనులు ఇంకా పెండింగ్‌లో ఉన్నప్పటికీ ప్రజలకు రైతు బజార్ సేవలు అందుబాటులోకి తీసుకురావాలనే ఉద్దేశంతో ఆదివారం నుంచి కూరగాయలు, పండ్లు, నాన్‌వెజ్ తదితర సరుకుల విక్రయాలను పూర్తిస్థాయిలో ప్రారంభించాలని కోరారు. రైతు బజార్‌లో మిగిలి ఉన్న షాపులకు టెండర్ ప్రక్రియను త్వరగా పూర్తి చేసి అన్ని షాపులను వినియోగంలోకి తీసుకురావాలని సింధు ఆదర్శ్‌రెడ్డి అధికారులను కోరారు. పెండింగ్‌లో ఉన్న మౌలిక సదుపాయాల పనులను వేగంగా పూర్తి చేసి రైతు బజార్‌ను పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. రైతు బజార్ అందుబాటులోకి వస్తే భారతీనగర్, బాంబే కాలనీతో పాటు పరిసర ప్రాంతాల ప్రజలకు ప్రయోజనం కలుగుతుందని నాయకులు తెలిపారు. తాజా కూరగాయలు, పండ్లు, నాన్‌వెజ్ తదితర సరుకులు ఒకే చోట లభించడంతో ప్రజలకు నిత్యావసరాల కొనుగోలు మరింత సులభతరం అవుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రామచంద్రాపురం మాజీ కార్పొరేటర్ తొంట అంజయ్య, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు కుమార్‌గౌడ్, జగన్నాథ్‌రెడ్డి, జీహెచ్ఎంసీ అధికారులు, షాపుల కేటాయింపుదారులు తదితరులు పాల్గొన్నారు.

# అసెంబ్లీ ఆందోళనలను అక్రమ అరెస్టులతో అడ్డుకుంటారా..

**సాముహిక దీక్ష ప్రారంభమే**

**దీక్షలు ప్రారంభించిన నున్నా నాగేశ్వారావు**



**ఖమ్మం క్రైమ్ మిర్రర్ బ్యూరో:** అసెంబ్లీ సమావేశాల సందర్భంగా సీఐటీయూ అనుబంధ స్కీమ్ వర్కర్స్ చలో హైదరాబాద్ అసెంబ్లీ ఆందోళనలను అక్రమ అరెస్టులతో అడ్డుకుంటారా కాంగ్రెస్ పాలకులారా అని సీఐటీయూ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కళ్యాణం వెంకటేశ్వరరావు, తుమ్మా విష్ణువర్ధన్ లు రాష్ట్ర ప్రభుత్వ విధానంపై గర్జించారు. ఇటీవల రాష్ట్రంలో జరిగిన అసెంబ్లీ సమావేశాల సందర్భంగా అంగన్వాడీ ఆశా గ్రామ పంచాయతీ, మున్సిపల్ తదితర రంగాల కార్మికులకు ఎన్నికలకు ముందు ఎన్నికల తర్వాత అధికారం చేపట్టాక రేవంత్ రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయాలని కోరుతూ సీఐటీయూ రాష్ట్ర కమిటి ఇచ్చిన పిలుపులను అడ్డుకున్న దానికి నిరసనగా బుదవారం రాష్ట్రవ్యాప్తంగా ఇచ్చిన పిలుపులో భాగంగా ఖమ్మం నగరంలోని నూతన కార్పొరేషన్ కార్యాలయం ఎదుట స్కీమ్ వర్కర్స్ తో సామూహిక దీక్షలు చేపట్టారు. దీక్షలను తెలంగాణ రైతుసంఘం రాష్ట్ర నాయకులు నున్నా నాగేశ్వరరావు, ఆల్ ఇండియా బార్ కౌన్సిల్ నాయకులు కొల్లి సత్యనారాయణ మందడపు శ్రీను, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు మాదినేని రమేష్ దీక్షా పరులకు దండలు వేసి ప్రారంభించారు.ఈ సందర్భంగా జరిగిన సభలో మాదినేని మాట్లాడుతూ అనుమతులు తీసుకొని శాంతియుత ధర్నాలకు చలో ఇందిరాపార్క్ పిలుపులు ఇస్తే మహిళా కార్మికులని కూడా చూడకుండా అర్ధరాత్రి అక్రమంగా అరెస్టులు మగ పోలీసులతో చేయించి భయబ్రాంతులకు గురి చేయడం ప్రజాస్వామ్యం కాదని గత పాలకులు ఇలాగే చేసి పామ్ హౌస్ కు పరిమితమయ్యరని మీకు అదే గతి పడుతుందని హెచ్చరించారు.ఈ దీక్షలకు బోడేపూడి విజ్ఞాన కేంద్రం మేనేజర్ శ్రీనివాసరావు,ఆర్టీసీ ఎస్ డబ్ల్యు ఎఫ్ నాయకులు గడ్డం లింగమూర్తి,యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు ముత్తమాల ప్రసాద్ తదితరులు పాల్గొని సంఘీభావం తెలిపారు. ఈ దీక్షలో సీఐటీయూ జిల్లా కోశాధికారి చలమాల విఠల్ రావు, జిల్లా ఉపాధ్యక్షులు జిల్లా ఉపేందర్, శ్రామిక మహిళా కన్వీనర్ పిన్నింటి రమ్య, పెరుమాళ్ళపల్లి మోహన్ రావు, సహాయ కార్యదర్శిలు శీలం నరసింహారావు, మల్లూరు చంద్రశేఖర్, జెల్లారపు మంగ, ముదాం శ్రీనివాసరావు, దోనోజు లక్ష్మయ్య, నవీన్ రెడ్డి, బషీర్, బాధవత్ శ్రీను, పడకంటి మురళీ, పగిడికత్తుల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# దళిత బహుజనులు ఆర్థిక రాజకీయంగా అభివృద్ధి చెందాలి



**నూతనకల్ (క్రైమ్ మిర్రర్):** దళిత బహుజనులు ఆర్థికంగా, రాజకీయంగా అభివృద్ధి చెందడంతో పాటు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలనే లక్ష్యంతో డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ స్థాపించిన రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా ఆశయాలను కొనసాగిస్తున్నామని రాష్ట్ర అధ్యక్షులు పసుల రవికుమార్, తెలిపారు.బుధవారం నూతనకల్ మండల కేంద్రంలో ఆర్పీఐ (అత్వాలే) పార్టీ సమావేశం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు పసుల రవికుమార్, రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు సరిగోమ్ముల స్నేహలత, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుంచు లింగయ్య పాల్గొన్నారు.ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షులు పసుల రవికుమార్ మాట్లాడుతూ... దళిత బహుజనులు ఆర్థికంగా, రాజకీయంగా అభివృద్ధి చెందడంతో పాటు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలనే లక్ష్యంతో రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా కొనసాగిస్తున్నామని తెలిపారు. కేంద్ర న్యాయశాఖ మంత్రి, పార్టీ జాతీయ అధ్యక్షులు రాందాస్ అత్వాలే నాయకత్వంలో పార్టీ కొనసాగుతోందని అన్నారు.డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్‌పై తప్పుదోవ పట్టించే విధంగా వ్యాఖ్యలు చేస్తున్న హమారా ప్రసాద్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని రవికుమార్ డిమాండ్ చేశారు.రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుంచు లింగయ్య మాట్లాడుతూ దళిత బహుజనులు గతంలో ఎన్నో రాజకీయ పార్టీలకు సేవలు అందించారని, ఇక తమ కోసం ఏర్పాటైన రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా (అత్వాలే)కి తెలంగాణ రాష్ట్రంలో అవకాశం కల్పించాలని కోరారు.రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు సరిగోమ్ముల స్నేహలత మాట్లాడుతూ భారతదేశంలో మహిళలకు ఓటు హక్కుతో పాటు సమాన హక్కుల కోసం డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ చేసిన కృషిని గుర్తు చేశారు. తెలంగాణలో దళిత బహుజనులు విద్యావంతులుగా, రాజకీయ నాయకులుగా, పారిశ్రామికవేత్తలుగా అభివృద్ధి చెందడమే పార్టీ ముఖ్య ఉద్దేశమని తెలిపారు.ఈ కార్యక్రమంలో పాల్వాయి సూరయ్య, బత్తుల విజయ్ కుమార్, పంతం యాకయ్య, పంతం రాములు, పాల్వాయి నాగయ్య, పాల్వాయి బాలయ్య కొమ్ము శ్రీరాములు, తదితరులు పాల్గొన్నారు.

## విఘ్నేశ్వరుడి ఆశీస్సులు ప్రజలందరికీ ఎల్లప్పుడూ ఉండాలి: తెలంగాణ రాష్ట్ర సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్



**బాలాపూర్ (క్రైమ్ మిర్రర్) :** విఘ్నేశ్వరుడి ఆశీస్సులు ప్రజలందరిపై ఎల్లవేళలా ఉండాలని, ప్రజలు సుఖశాంతులతో జీవితం గడపాలని, తెలంగాణ రాష్ట్ర స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ అన్నారు. వినాయక చవితి రెండో రోజు మంగళవారం నాడు అల్మాస్గూడ శ్రీ రామాంజనేయ భక్తకళా మండలి ఆధ్వర్యంలో మాజీ ఎమ్మెల్యే మహేశ్వరం నియోజకవర్గం ఇన్చార్జి కిచ్చన్న గారి లక్ష్మారెడ్డి తో కలిసి ఆయన వినాయకుడి పూజలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా గడ్డి అన్నారం మార్కెట్ కమిటీ డైరెక్టర్ 57వ డివిజన్ నాదర్గుల్ అధ్యక్షులు బోయపల్లి గోవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ వినాయక చవితి వంటి పర్వదినాలలో ప్రజలు భక్తి ఐక్యత సోదర భావం సామాజిక చైతన్యాన్ని పెంపొందిస్తాయని అన్నారు. అల్మాస్గూడ ప్రజలతో కలిసి ఈ పవిత్ర కార్యక్రమంలో పాల్గొని విగ్నేశ్వర్ రెడ్డి ఆశీస్సులు పొందడం ఎంతో ఆనందంగా ఉందని గోవర్ధన్ రెడ్డి అన్నారు.

ఈ కార్యక్రమంలో ఎలిమినేటి అమరేందర్ రెడ్డి, మర్రి శశాంక్ రెడ్డి, కమిటీ సభ్యులు, మాజీ జడ్పిటిసి బంగారు సత్యనారాయణ, బోయపల్లి వెంకటరెడ్డి, రామిడి కృష్ణారెడ్డి, ఏనుగు లక్ష్మారెడ్డి, తుఫాన్ రెడ్డి, రాజు యాదవ్, రామిడి వెంకటరెడ్డి, చప్పిడి కొండల్ రెడ్డి, ఉపేందర్ రెడ్డి, దిండు శ్రీనివాస్ గౌడ్, మలగార శ్రీకాంత్ రెడ్డి, రామిడి సుభాష్ రెడ్డి, పర్వత రవి కాంత్ రెడ్డి, శ్రీధర్ గౌడ్, మల్లేష్ యాదవ్, రామిడి నిరంజన్ రెడ్డి, రవికాంత్, దిలీప్ రెడ్డి తో పాటు రామాంజనేయ భక్తకళా మండలి సభ్యులు ఫ్రెండ్స్ యూత్ సభ్యులు వివేకానంద యువజన సంఘం సభ్యులు యువత భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## లోధా సామాజిక వర్గంపై బీసీ కమిషన్ క్షేత్రస్థాయి విచారణ

**సామాజిక, ఆర్థిక, విద్యా స్థితిగతులపై ఆరా**

**సమగ్ర నివేదికను ప్రభుత్వానికి అందిస్తాం: బీసీ కమిషన్ చైర్మన్ జి.నిరంజన్**





**నారాయణఖేడ్, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి సెప్టెంబర్ 16:** లోధ్/లోదా సామాజిక వర్గం ప్రజల సామాజిక, ఆర్థిక, విద్యా, వృత్తి, జీవన పరిస్థితులను తెలుసుకునేందుకు తెలంగాణ రాష్ట్ర బీసీ కమిషన్ బుధవారం క్షేత్రస్థాయి విచారణ నిర్వహించింది. సిర్గాపూర్ మండలం కడప్పల్ గ్రామంలోని రైతు వేదికతో పాటు నిజాంపేట్ మండల కేంద్రంలోని రైతు వేదికలో లోధా సామాజిక వర్గ ప్రజలతో కమిషన్ సభ్యులు సమావేశమై వారి సమస్యలు, స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. బీసీ కమిషన్ చైర్మన్ జి.నిరంజన్, సభ్యులు రాపోలు జయప్రకాశ్, తిరుమలగిరి సురేందర్, డా.బాలలక్ష్మి, బీసీ సంక్షేమ శాఖ ప్రత్యేక అధికారి సతీష్‌కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా చైర్మన్ నిరంజన్ మాట్లాడుతూ.. లోధా సామాజిక వర్గాన్ని బీసీ జాబితాలో చేర్చాలని కోరుతూ గత కొంతకాలంగా కమిషన్‌కు వినతులు అందుతున్నాయని తెలిపారు. ఈ నేపథ్యంలో రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో ఆ సామాజిక వర్గం ప్రజలు నివసిస్తున్న ప్రాంతాలను సందర్శించి వారి సామాజిక, ఆర్థిక పరిస్థితులు, సంప్రదాయాలు, వృత్తులు, విద్యా స్థితిగతులను పరిశీలిస్తున్నట్లు చెప్పారు.కొన్ని ప్రాంతాల్లో లోధా సామాజిక వర్గానికి బీసీ కుల ధ్రువీకరణ పత్రాలు జారీ అవుతున్నప్పటికీ సంగారెడ్డి, మెదక్ జిల్లాల్లో ధ్రువీకరణ పత్రాలు రావడం లేదని ఫిర్యాదులు అందినట్లు తెలిపారు. స్వాతంత్ర్యం అనంతరం, నిజాం సంస్థానం భారతదేశంలో విలీనమైన తర్వాత ఈ సామాజిక వర్గానికి సంబంధించిన వివరాలు, ఆధారాల సమర్పణలో ఏవైనా లోపాలు ఉన్నాయా అనే అంశాన్ని కూడా పరిశీలిస్తున్నట్లు పేర్కొన్నారు. క్షేత్రస్థాయి విచారణలో భాగంగా కుటుంబ పరిస్థితులు, ఆచార వ్యవహారాలు, సంప్రదాయాలు, వృత్తులు, జీవన విధానం, పిల్లల విద్య తదితర అంశాలను నమోదు చేస్తున్నామని తెలిపారు. విచారణ పూర్తయిన అనంతరం సమగ్ర సమాచారాన్ని క్రోడీకరించి ప్రభుత్వానికి, సంబంధిత శాఖలకు నివేదిక సమర్పిస్తామని స్పష్టం చేశారు. పిల్లలకు నాణ్యమైన విద్య అందించడం ద్వారా కుటుంబాల జీవన ప్రమాణాలను మెరుగుపరచుకోవచ్చని నిరంజన్ సూచించారు. గురుకులాలు, ప్రభుత్వ పాఠశాలల ద్వారా ప్రభుత్వం కల్పిస్తున్న విద్యా అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అర్హులైన వారు ఈడబ్ల్యూఎస్ కోటా ప్రయోజనాలను కూడా వినియోగించుకోవాలని సూచించారు.నారాయణఖేడ్ సబ్ కలెక్టర్ ఉమాహారతి మాట్లాడుతూ.. లోధా సామాజిక వర్గం ప్రజల సమస్యలు, స్థితిగతులను తెలుసుకునేందుకు బీసీ కమిషన్ క్షేత్రస్థాయికి రావడం అభినందనీయమన్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో అందుబాటులో ఉన్న పథకాలు, సేవల వివరాలను తెలుసుకుని అర్హత మేరకు లబ్ధి పొందాలని సూచించారు. పిల్లలను క్రమం తప్పకుండా పాఠశాలలకు పంపించాలని, పేరెంట్స్ కమిటీ సమావేశాల్లో పాల్గొని పాఠశాల అభివృద్ధిలో భాగస్వాములు కావాలని కోరారు. ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణిలో సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. అర్హులైన వారు కొత్త పింఛన్ల కోసం దరఖాస్తు చేసుకోవచ్చని, సిబ్బంది ఇంటింటికీ వెళ్లి దరఖాస్తులు స్వీకరిస్తున్నారని తెలిపారు. ఈకార్యక్రమంలో జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి జగదీష్, డీఎస్పీ, తహసీల్దార్ కిరణ్, ఎంపీడీవో, సర్పంచులు, లోధా సామాజిక వర్గ పెద్దలు, ప్రజలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



# వెల్జాల్ ఓటర్లకు ప్రత్యేక పోలింగ్ కేంద్రం కావాలి

**ఇతర గ్రామాల్లో ఉన్న ఓటర్లను వెల్జాల్‌కు మార్చాలని అధికారులకు వినతి**

**క్రైమ్ మిర్రర్ కల్వకుర్తి (తలకొండపల్లి):** తలకొండపల్లి మండలం వెల్జాల్ గ్రామపంచాయతీ పరిధిలోని ఓటర్ల సౌకర్యార్థం గ్రామంలో అదనంగా మరో పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని గ్రామ సర్పంచ్ వానరాసి రాములమ్మ, ఉపసర్పంచ్ శివ విజయలక్ష్మి విజయ్ కుమార్ కోరారు. ఈ మేరకు బుధవారం తహసీల్దార్ రమేష్ కుమార్, ఆర్ఐ శ్రవణ్‌లకు వినతిపత్రం అందజేశారు. వెల్జాల్ గ్రామపంచాయతీకి చెందిన పలువురు ఓటర్లు ప్రస్తుతం ఇతర గ్రామాల పరిధిలోని పోలింగ్ కేంద్రాల్లో ఓటు హక్కు వినియోగించుకోవాల్సి వస్తోందని వారు తెలిపారు. వెంకటాపూర్‌లోని 44వ పోలింగ్ కేంద్రంలో చెన్నంపల్లి, ఇబ్రాయిపల్లి గ్రామాలకు చెందిన వెల్జాల్ ఓటర్లు, మాదయపల్లిలోని 47వ పోలింగ్ కేంద్రంలోనూ వెల్జాల్ గ్రామపంచాయతీకి చెందిన ఓటర్లు ఉన్నారని అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఇతర గ్రామాల పోలింగ్ కేంద్రాల్లో ఉన్న వెల్జాల్ ఓటర్లందరినీ వెల్జాల్ గ్రామపంచాయతీ పరిధిలోకి తీసుకువచ్చి, గ్రామంలో కొత్తగా మరో పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. దీనివల్ల ఓటర్లు దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన ఇబ్బందులు తొలగుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిహెచ్. విష్ణువర్ధన్ యాదవ్, ఎంఏ అజీజ్, వార్డు సభ్యులు, సుభాన్, వి. శేఖర్, మస్క వెంకటయ్య, పి. సుల్తాన్, ఎల్. రమేష్, వి. బాలరాజ్, బి. జంగయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఆర్టీసీ బస్సు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి

**ముత్తంగి ORR బ్రిడ్జి కింద రోడ్డు ప్రమాదం**

**మృతుడి ఆచూకీ కోసం పోలీసుల ప్రయత్నం**



పటాన్‌చెరు, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి సెప్టెంబర్ 16: పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందాడు. పోలీసుల వివరాల ప్రకారం.. ముత్తంగి గ్రామ శివారులోని ఓఆర్ఆర్ బ్రిడ్జి కింద మంగళవారం రాత్రి సుమారు 7:30 గంటల సమయంలో 30--35 ఏళ్ల వయస్సు గల వ్యక్తి రోడ్డు దాటుతుండగా నర్సాపూర్ డిపోకు చెందిన టీజీ ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. పటాన్‌చెరు నుంచి సంగారెడ్డి వైపు వెళ్తున్న ు+ 35గ 0061 నంబర్ బస్సు ఢీకొనడంతో వ్యక్తికి తలతో పాటు శరీరంలోని ఇతర భాగాల్లో తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే పటాన్‌చెరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, మెరుగైన చికిత్స కోసం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం ఉదయం సుమారు 5:30 గంటలకు మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. ప్రమాదానికి సంబంధించి బస్సు డ్రైవర్ పెద్దోళ్ల శంకరయ్యపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. మృతుడి వివరాలు ఇంకా తెలియరాలేదు. మృతుడిని గుర్తించే వారు లేదా ప్రమాదానికి సంబంధించిన సమాచారం ఉన్నవారు పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ 8712661839 నంబర్‌ను సంప్రదించాలని పోలీసులు కోరారు.

## చేయూత పెన్షన్లపై క్షేత్రస్థాయి పరిశీలన

**చేర్యూకర్‌లో ఇంటింటా లబ్ధిదారుల వివరాల తనిఖీ**

**క్రైమ్ మిర్రర్ కల్వకుర్తి (వెల్దండ)** వెల్దండ మండలంలో చేయూత పెన్షన్ల పరిశీలనలో భాగంగా చేర్యూకర్ గ్రామపంచాయతీలో స్పెషల్ ఆఫీసర్, ఇరిగేషన్ ఏఈ మాల్యా నాయక్ బుధవారం క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించారు. గ్రామంలో ఇంటింటికీ తిరుగుతూ పెన్షన్ లబ్ధిదారుల వివరాలను స్వయంగా పరిశీలించడంతో పాటు సంబంధిత పత్రాలను తనిఖీ చేశారు. ఈ పరిశీలన కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ మాల్యా నాయక్‌తో పాటు గ్రామ సర్పంచ్ బచ్చులకూర శ్రీనివాసులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ శ్రీనివాసులు మాట్లాడుతూ.. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పెన్షన్ అందేలా చూడాలని, అనర్హులకు ఒక్క రూపాయి కూడా మంజూరు కాకుండా అధికారులు క్షుణ్ణంగా పరిశీలించాలని సూచించారు. అవినీతికి తావులేకుండా అర్హులైన పేదలకు న్యాయం జరిగేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సర్పంచ్ కోరారు.



క్రైమ్ మిర్రర్
Voice of Anti Corruption
తెలంగాణ జిల్లాలు
10 గురువారం 17-9-2026

# గంజాయి రవాణాపై ఉక్కుపాదం మోపాలి

## రామకృష్ణాపూర్ పోలీస్ స్టేషన్ ను తనిఖీ చేసిన రామగుండం సీపీ అంబర్ కిషోర్ ఝూ

## రైలు, రహదారి మార్గాలపై ప్రత్యేక నిఘా.. వృద్ధుల భద్రతకు ఎస్ఓపీ అమలు చేయాలని ఆదేశం

**రామకృష్ణాపూర్, సెప్టెంబరు 16 (క్రైమ్ మిర్రర్) :** మహారాష్ట్ర సరిహద్దు ప్రాంతాల నుంచి రైలు, రహదారి మార్గాల ద్వారా జరిగే గంజాయి, ఇతర మాదకద్రవ్యాల అక్రమ రవాణాపై ప్రత్యేక నిఘా ఉంచి ఉక్కుపాదం మోపాలని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝూ ఆదేశించారు. రామగుండం పోలీస్ కమిషనరేట్ మంచిర్యాల జోన్ పరిధిలోని రామకృష్ణాపూర్ పోలీస్ స్టేషన్‌ను బుధవారం వార్షిక తనిఖీల్లో భాగంగా ఆయన పరిశీలించారు. స్టేషన్‌కు చేరుకున్న సీపీకి సీఐ రమేష్, ఎస్ఐ శ్రీధర్ మొక్క అందజేసి స్వాగతం పలికారు. అనంతరం సిబ్బంది నుంచి గౌరవ వందనం స్వీకరించారు.పోలీస్ స్టేషన్ ఆవరణలో అధికారులతో కలిసి సీపీ మొక్క నాటారు. అనంతరం స్టేషన్ పరిసరాలు, సిబ్బంది రిసెప్షన్ కేంద్రాన్ని పరిశీలించారు.స్టేషన్ పరిసరాలను ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచాలని,5ఎస్ విధానాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు. వివిధ కేసుల్లో స్వాధీనం చేసుకున్న వాహనాలను క్రమబద్ధంగా ఉంచడంతో పాటు వాటి వివరాలను సక్రమంగా నమోదు చేసి నిర్వహించాలని ఆదేశించారు.



**రికార్డుల పరిశీలన:** రిసెప్షన్ కేంద్రం సిబ్బందితో మాట్లాడి రికార్డులను పరిశీలించారు. స్టేషన్ రైటర్, సీసీటీఎన్ఎస్ రైటర్లతో మాట్లాడి ఆన్‌లైన్‌లో వివరాల నమోదు, రికార్డుల అప్‌లోడ్ ప్రక్రియను పరిశీలించారు. పోలీస్ స్టేషన్‌లోని అన్ని రికార్డులను క్రమబద్ధంగా నిర్వహించాలని సూచించారు. సిబ్బందితో మాట్లాడి వారి వ్యక్తిగత, శాఖాపరమైన సమస్యలను అడిగి తెలుసుకున్నారు.స్టేషన్ పరిధిలో నమోదవుతున్న ప్రధాన నేరాలు, పెండింగ్ కేసులు, దర్యాప్తు పురోగతి, రౌడీషీటర్లు, హిస్టరీషీటర్ల కదలికలు, విజిబుల్ పోలీసింగ్, పెట్రోలింగ్ తదితర అంశాలపై ఎస్ఐను అడిగి వివరాలు తెలుసుకున్నారు. సిబ్బంది శారీరక దారఢ్యంతో పాటు విధి నిర్వహణ, పోలీస్ స్టేషన్ నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సీఐ, ఎస్ఐలకు సూచించారు.

**ఫిర్యాదుదారులతో మర్యాదగా వ్యవహరించాలి:** పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రతి ఫిర్యాదుదారు, బాధితుడితో మర్యాదపూర్వకంగా, మానవీయ దృక్పథంతో వ్యవహరించాలని సీపీ సూచించారు. వారి సమస్యలను పూర్తిగా తెలుసుకుని, చట్ట పరిధిలో త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.రామకృష్ణాపూర్ పోలీస్ స్టేషన్ ప్రధాన రహదారి, రైల్వే స్టేషన్ పరిధిలో ఉండటంతో శాంతిభద్రతల పరిరక్షణలో కీలకమైందని పేర్కొన్నారు. రోజురోజుకూ విస్తరిస్తున్న కొత్త కాలనీల నేపథ్యంలో రహదారి భద్రత, మహిళల భద్రత, శాంతిభద్రతలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.

**సీసీ కెమెరాలపై ప్రశంస**

ప్రజలు, స్థానిక వ్యాపారుల భాగస్వామ్యంతో సీసీ కెమెరాలను విస్తృతంగా ఏర్పాటు చేయించడం, వాటి ద్వారా ఆస్తి నేరాల నియంత్రణకు చర్యలు తీసుకోవడాన్ని సీపీ అభినందించారు. నేరాల నియంత్రణతో పాటు పోయిన సొత్తు రికవరీకి సీసీ కెమెరాలు ఉపయోగపడుతున్నాయని పేర్కొన్నారు.

**వృద్ధుల భద్రతకు ప్రత్యేక ప్రణాళిక**

కొత్తగా ఏర్పడుతున్న కాలనీల్లో నివసిస్తున్న వృద్ధుల భద్రతకు ప్రత్యేక ప్రాధాన్యం ఇవ్వాలని సీపీ ఆదేశించారు. ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా వృద్ధుల భద్రత కోసం ప్రత్యేక ప్రామాణిక కార్యాచరణ విధానం (ఎస్ఓపీ) రూపొందించి అమలు చేయాలని సూచించారు. బ్లూ కోల్ట్స్ సిబ్బంది క్రమం తప్పకుండా ఆయా ప్రాంతాల్లో పర్యటిస్తూ భద్రతా పరిస్థితులను పరిశీలించాలని ఆదేశించారు.

**ఈ-సమన్ల పెండింగ్ 'సున్నా'**

పోలీస్ స్టేషన్ పరిధిలో ఈ-సమన్ల పెండింగ్ లేకపోవడాన్ని సీపీ అభినందించారు. కోర్టు ఆదేశాలను సకాలంలో అమలు చేస్తున్న తీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు. బ్లూకోల్ట్స్, సెక్టార్ ఇన్‌చార్జీల పనితీరును మరింత మెరుగుపరచాలని సూచించారు.పోలీస్ స్టేషన్ నిర్వహణ బాగుందని పేర్కొన్న సీపీ.. ఇదే స్ఫూర్తితో సిబ్బంది సమన్వయంతో పనిచేస్తూ ప్రజలకు మరింత మెరుగైన పోలీస్ సేవలు అందించాలని ఆదేశించారు.



# కేజీబీవీలో రుతుక్రమ పరిశుభ్రతపై అవగాహన

### 3,000 శానిటరీ ప్యాడ్ల పంపిణీ..

### పోషకాహారం, వ్యక్తిగత పరిశుభ్రతపై విద్యార్థినులకు అవగాహన

**సంగారెడ్డి, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి సెప్టెంబర్ 16:** బేటీ బచావో--బేటీ పడావో కార్యక్రమంలో భాగంగా మహిళా, శిశు సంక్షేమ శాఖ, జిల్లా మహిళా సాధికారత కేంద్రం ఆధ్వర్యంలో పుల్కల్ కేజీబీవీలో విద్యార్థినులకు రుతుక్రమ పరిశుభ్రత, వ్యక్తిగత పరిశుభ్రత, పోషకాహారం, ఆరోగ్య పరిరక్షణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శానిటరీ ప్యాడ్లను సరైన విధంగా వినియోగించడం, భద్రపరచడం, వినియోగం అనంతరం పరిశుభ్రంగా పారవేయడం వంటి అంశాలపై విద్యార్థినులకు అవగాహన కల్పించారు. శానిటరీ ప్యాడ్ బ్యాంకు ద్వారా 3,000 శానిటరీ ప్యాడ్లను పంపిణీ చేశారు. బాలికల ప్రాధాన్యతను తెలియజేస్తూ విద్యార్థినులతో మొక్కలు నాటించారు. కార్యక్రమంలో జిల్లా సమన్వయకర్త పల్లవి, సీడీపీఓ మధులిక, ఎంఈఓ శంకర్, ఎస్ఓ ఇంద్రజ, మెడికల్ ఆఫీసర్ శ్వేత, పంచాయతీ కార్యదర్శి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, జెండర్ స్పెషలిస్ట్, ఆశా వర్కర్, విద్యార్థినులు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.అదేవిధంగా చౌటకూరు కేజీబీవీలోనూ విద్యార్థినులకు రుతుక్రమ పరిశుభ్రత, పోషకాహారం, ఆరోగ్య పరిరక్షణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

# పార్ట్‌టైమ్ టీచర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

### 18లోగా దరఖాస్తులు.. 19న డెమో, ఇంటర్వ్యూలు



సంగారెడ్డి, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి సెప్టెంబర్ 16: సంగారెడ్డి జిల్లాలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలు, కళాశాలల్లో 2026--27 విద్యా సంవత్సరానికి తాత్కాలిక ప్రాతిపదికన పార్ట్‌టైమ్ టీచర్ల నియామకానికి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ తెలిపారు. అభ్యర్థులు ఈ నెల 18వ తేదీ సాయంత్రం 4 గంటలలోగా చిట్కుల్‌లోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో దరఖాస్తులు సమర్పించాలి. దరఖాస్తు చేసుకున్న వారు 19న ఉదయం 10 గంటలకు విద్యార్హతల ఒరిజినల్ సర్టిఫికెట్లు, రెండు పాస్‌పోర్ట్ సైజు ఫొటోలతో డెమో, ఇంటర్వ్యూకు హాజరుకావాలని సూచించారు.ఇప్పటికే దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు మళ్లీ దరఖాస్తు చేయాల్సిన అవసరం లేదని కలెక్టర్ స్పష్టం చేశారు. కొత్తగా దరఖాస్తు చేసుకునే అర్హత, ఆసక్తి ఉన్న అభ్యర్థులు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు జిల్లా సమన్వయ అధికారి, ౧+ూఔ=జు×ూ, చిట్కుల్‌ను 9704550253, 9640382248 నంబర్లలో సంప్రదించవచ్చు.

# ఘనంగా వినాయక చవితి ఉత్సవాలు...

### గణేష్ నవరాత్రి పూజలు జరిపిస్తున్న పురోహితులు పందిళ్ళపల్లి వెంకటేశ్వర్లు..

**భద్రాద్రి కొత్తగూడెం సెప్టెంబర్ 16:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని పలు గ్రామాలలో గల గణేష్ నవరా త్రోత్సవ మండపాలలో (తొమ్మిది రోజులు) పందిళ్ళపల్లి వెంకటేశ్వర్లు (మిత అయ్యాళ్వార్) పురోహితు లు ఘనంగా వినాయక చవితి ఉత్సవాలు జరిపిస్తున్నారు. సనాతన హిందూ ధర్మాన్ని అనుచరిస్తూ ప్రజలలో భక్తిని పెంపొందిస్తు నిత్య వైష్ణవ సాంప్రదాయాన్ని హిందూ తత్వాన్ని ప్రజలకు తెలియజేస్తూ భక్తిని పెంపొందిస్తున్నారు.గణేష్ ఉత్సవ మండపాల వద్ద భక్తిని పెంపొందించే సనాతన హిందూ ధర్మాన్ని పదిమందికి తెలియచేసే విధంగా భజనలు, హరినామ కీర్తనలు,కోలాటా లు చేస్తూ రానున్న భావితరానికి మంచి సందే శాన్ని అందించే విధంగా ప్రతి ఒక్కరూ సహక రించాలని కోరారు.నవరాత్రులు పూర్తయ్యేం తవరకు గ్రామాలలో బెల్ట్ షాపులు (మద్యం దుకాణాలు) నాటు సారా అమ్మకాలను నిషే ధించాలని అధికారులను కోరారు.అధికారులు గ్రామాలలో వివిధ రకాల మత్తుపదార్థాలను నిషేధించి యువత మత్తుకు బానిస కాకుండా చూడాలని కోరారు.



# కుందారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డీఎంహెచ్‌వో ఆకస్మిక తనిఖీ

### వైద్య సేవలు, జాతీయ ఆరోగ్య కార్యక్రమాల అమలుపై పరిశీలన

**మంచిర్యాల సెప్టెంబర్ 16 (క్రైమ్ మిర్రర్ ):** జైపూర్ మండలం కుందారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ నరేందర్ రాథోడ్ బుధవారం ఆకస్మికంగా సందర్శించారు. కేంద్రంలో అందుతున్న వైద్య సేవలు, జాతీయ ఆరోగ్య కార్యక్రమాల అమలు, మందులు, వ్యాక్సిన్ నిల్వలను పరిశీలించారు. అనంతరం వైద్యులు, సిబ్బందికి పలు సూచనలు, ఆదేశాలు జారీ చేశారు.క్షయ వ్యాధి నియంత్రణ, మాతా శిశు సంరక్షణపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ప్రతి గర్భవతిని వందశాతం నమోదు చేయడంతో పాటు, అర్హులైన చిన్నారులకు పూర్తిస్థాయిలో టీకాలు అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని వ్యాక్సిన్ నిల్వలను పరిశీలించి, అన్ని రకాల టీకాలు అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలని సూచించారు.అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఉపకేంద్రాల్లో వైద్యులు, సిబ్బంది సమయపాలన పాటించాలని ఆదేశించారు. వాతావరణ మార్పుల నేపథ్యంలో జ్వరాలు, ఇతర



సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. గ్రామపంచాయతీ సర్పంచులు, మండలస్థాయి అధికారులతో సమన్వయం చేసుకుంటూ వ్యాధుల నియంత్రణకు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభావిత గ్రామాల్లో వైద్య శిబిరాలు నిర్వహించాలని, పాఠశాలలు, గురుకుల, ఆశ్రమ పాఠశాలలను సందర్శించి విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించాలని ఆదేశించారు.పోషణ అభియాన్, ప్రపంచ రోగి భద్రత దినోత్సవాల సందర్భంగా రోగులు, వైద్య సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యులు, సిబ్బంది అందిస్తున్న సేవలపై డీఎంహెచ్‌వో సంతృప్తి వ్యక్తం చేశారు. రోజువారీగా 'ఈ-ఔషధి' కార్యక్రమాన్ని పర్యవేక్షించాలని, 'టెలి-మానస్' ద్వారా మానసిక ఆరోగ్యంపై అవగాహన కల్పించాలని సూచించారు.



మహిళా ఆరోగ్య క్లినిక్ సేవలను కూడా పరిశీలించారు.పాము, కుక్క కాటుకు సంబంధించిన అత్యవసర మందులు, ఇతర ప్రాణరక్షక ఔషధాలను ఎల్లప్పుడూ అందుబాటులో ఉంచుకోవాలని ఆదేశించారు. స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులతో సమన్వయం చేసుకుంటూ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో జిల్లా మాస్ మీడియా అధికారి బుక్క వెంకటేశ్వర్లు, హెచ్ఈఓ రాంబాబు, వైద్యులు డాక్టర్ రవి, భారతి, జయమ్మ, నాగమణి, మక్బుల్ సాదిక్, రవి, రఫీక్ తదితరులు పాల్గొన్నారు.

# గణేష్ ఉత్సవాలు ప్రశాంతంగా నిర్వహించాలి

### డీజేలకు అనుమతి లేదు..

### నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవు: వెల్దండ సీఐ

క్రైమ్ మిర్రర్ కల్వకుర్తి (వెల్దండ): గణేష్ ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో, ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని వెల్దండ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రఘువీర్ రెడ్డి సూచించారు. ఉత్సవాల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా గణేష్ మండపాల నిర్వాహకులు, భక్తులు పోలీసుల సూచనలు, నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని కోరారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గణేష్ ఉత్సవాల్లో డీజే సౌండ్‌కు అనుమతి లేదని స్పష్టం చేశారు. మండపాల వద్ద ఏర్పాటు చేసే చిన్న లౌడ్‌స్పీకర్లను చుట్టుపక్కల ప్రజలకు ఇబ్బంది కలగకుండా, అనుమతించిన శబ్ద పరిమితిలో మాత్రమే వినియోగించాలని సూచించారు. మండపాల్లో విద్యుత్ వైరింగ్‌ను సురక్షితంగా ఏర్పాటు చేయడంతో పాటు అగ్నిప్రమాదాల నివారణకు అవసరమైన భద్రతా చర్యలు చేపట్టాలని తెలిపారు.ఉత్సవాల్లో మద్యం సేవించి పాల్గొనడం, గొడవలకు పాల్పడటం పూర్తిగా నివారించాలని, అసభ్యకరమైన పాటలు, నినాదాలు, ఇతరులను రెచ్చగొట్టే కార్యక్రమాలకు తావివ్వరాదన్నారు. ఇతర మతాలు, వర్గాల మనోభావాలను దెబ్బతీసే విధంగా వివాదాస్పద బ్యానర్లు, పోస్టర్లు, నినాదాలు ఏర్పాటు చేయరాదని సూచించారు.మైనర్లను వాహనాలు నడపనివ్వకూడదని, గణేష్ ఊరేగింపులో వాహనాలపై ప్రమాదకరంగా ప్రయాణించడం, వాహనాలపై నిలబడటం చేయరాదన్నారు. నిమజ్జనం సమయంలో ఈత రాని వ్యక్తులు, చిన్నపిల్లలు చెరువులు,



సరస్సులు, కాలువల్లోకి వెళ్లకుండా తల్లిదండ్రులు, మండపాల నిర్వాహకులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు.అదేవిధంగా ఉత్సవాల సమయంలో అనుమానాస్పద వ్యక్తులు లేదా వస్తువులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. సోషల్ మీడియాలో తప్పుడు వార్తలు, వదంతులు, రెచ్చగొట్టే పోస్టులను ప్రచారం చేయడం లేదా వాటిని ఫార్వర్డ్ చేయడం చేయరాదని హెచ్చరించారు. భక్తితో గణేష్ ఉత్సవాలు నిర్వహిస్తూ.. బాధ్యతతో భద్రతను పాటించి శాంతి, సామరస్యాలను కాపాడాలని సీఐ కోరారు.

Printed, Published and Edited by Makam Gangadhar, H.No. 11-13-1100, Dwarakanagar Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.S. Owned by Makam Gangadhar and Printed at MGR Publications, H.No. 11-13-1100, Dwarakanagar Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.S. Editor & Managing Director: Makam Gangadhar +919393446188, RNI No. APTEL/2012/45151.